ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

గురువారం 3 ఏప్రిల్ 2025 | 5

స్నానానికి వెళ్లి.. శాశ్వతంగా దూరమై!

- కాకినాడ జిల్లాలో విషాద ఘటనలు
- ఏలేశ్వరం, పెద్దాపురంల్లో స్నానానికి దిగి నలుగురి మృతి

7



- చంద్రబాబు కలల ప్రాజెక్టు టిడ్కో
- ప్రభుత్వమొస్తే కష్టాలు తీర్చేస్తామని ఎన్నికల హామీ
- వచ్చి పది నెలలు దాటినా అడుగు ముందుకు పడని వైనం
- జూన్ 12 నాటికి ఇళ్లు అప్పగించాలని తాజా లక్ష్యం
- మౌలిక సదుపాయాలు లేకుండా ఎలా ఉండేదని లబ్ధిదారుల ప్రశ్న
- ఉన్న ఫ్లాట్లూ అస్తవ్యస్తం.. తాగునీరే లేని దుస్థితి
- నేడు విజయవాడలో రాష్ట్రస్థాయి టిడ్కో సమావేశం

ఎన్నాళ్లీ.. నిరీక్షణ!

పేదవాడి సొంతింటి కలను నిజం చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాల నిర్మాణం పెద్దఎత్తున జరిగింది. అపార్టుమెంటు తరహాలో చేసిన ఈ ఇళ్ల కోసం లబ్ధిదారులు పోటీపడ్డారు. సర్వహంగులతో గేటెడ్ కమ్యూనిటీ కాలనీలుగా నిర్మించిన ఈ భవనాలు చూసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు. దశల వారీగా చేపట్టిన ఈ ఫ్లాట్ల నిర్మాణం తొలి దశ పూర్తికావడంతో లబ్ధిదారులకు అందించారు. మలి దశ ఫ్లాట్ల నిర్మాణమూ పూర్తయింది. కానీ ఈలోపు ఎన్నికలు రావడంతో గృహ ప్రవేశాలు చేసుకుందామని సిద్ధమైన వారికి ఆ అవకాశం చిక్కలేదు. ఎన్నికలయ్యాక వైసీపీ ప్రభుత్వం ఈ కాలనీలను గాలికి వదిలేసింది. లబ్ధిదారులు ఎన్నిసార్లు ప్రాథేయపడినా ఏదొక నెపంతో ఐదేళ్లూ కాలం గడిపేసింది. మౌలిక సదుపాయాలనూ పట్టించుకోలేదు. తమ పార్టీ రంగులు వేసి మమ అనిపించింది. దీంతో మళ్లీ చంద్రబాబు సీఎం అయితేనే తమ ఇళ్లకు మోక్షం కలుగుతుందని లబ్ధిదారులంతా ఎదురుచూశారు. అనుకున్నట్టుగానే చంద్రబాబు సీఎం అయ్యారు. కొత్త ప్రభుత్వం వచ్చి పది నెలలు కావొస్తోంది. ఇప్పటికీ వీరి కష్టాలు తీరలేదు. చంద్రబాబు రాగానే ఈ కాలనీల తీరే మారిపోతుందని కలలు గన్న వారి ఆశలు తీరనేలేదు. ఇప్పటికైనా కాస్త మా కాలనీల వైపు చూడండయ్యా అంటూ లబ్ధిదారులు ఎమ్మెల్యేలను, అధికారులనూ వేడుకొంటున్నారు. నిజానికి జూన్ 12 నాటికి టిడ్కో గృహాల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు క్షేత్ర స్థాయిలో చొరవ లేదు. పైగా మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఎలా ఉంటామని లబ్ధిదారుల ప్రశ్న. ఈ నేపథ్యంలో ఏపీ టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విజయవాడలో టిడ్కో అధికారులు, ఇంజనీర్లు, సిబ్బందితో సమావేశం జరుగనుంది. మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించే అవకాశం ఉంది.

బొమ్మూరులో బాగు ఏదీ..

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాల్లో 2014-19 మధ్య పేదవాని సొంతింటి కలను నిజంచేస్తూ బొమ్మూరులో అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం టిడ్కో గృహాల నిర్మాణాలను చేపట్టి 99 శాతం పూర్తి చేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ గృహాలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందించలేకపోయింది. దాంతో ఐదేళ్లపాటు 6,304 మంది లబ్ధిదారులు టిడ్కో గృహాల కోసం ఎదురుచూశారు. రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్న వరకైనా తమ ఇళ్లను అప్పగించాలని వేడుకుంటూనే ఉన్నారు. చివర్లో మాత్రం వైసీపీ రంగులు ఆ భవనాలకు వేసి హడావుడి చేసింది. కానీ ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదు. ఈలోపు ప్రభుత్వం మారింది. చంద్రబాబు సీఎం అయ్యారు. తమ కష్టాలు తొలగినట్టేనని లబ్ధిదారులు సంతోషపడ్డారు. కానీ అధికారంలోకి పది నెలలు కావొస్తున్నా ఇప్పటికీ అప్పగించలేదు. మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేయలేదు. ప్రస్తుతం బొమ్మూరులో ఉన్న టిడ్కో ఇళ్లలో సెప్టిక్ ట్యాంకుల కనెక్టింగ్ చేయాల్సి ఉంది. అలానే తొర్రేడులో ఉన్న టిడ్కో గృహాల వద్ద రహదారులు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాల్సి ఉంది.



బీసీ కార్పొరేషన్ రుణాలకు 31,324 దరఖాస్తులు

- కాపు కార్పొరేషన్ రుణాలకు 21136 దరఖాస్తులు
- మొత్తం 2961 యూనిట్ల లక్ష్యం

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు జిల్లా వ్యాప్తంగా 2198 యూనిట్లకు గాను 31324 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాపు కార్పొరేషన్‌కి 763 యూనిట్లకు గాను 21,136మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మండల, మున్సిపల్ పరిధిలో ఇంటర్వ్యూల ప్రక్రియ మొదలుపెట్టారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఎంపిక చేసిన అభ్యర్థుల వివరాలను ఎంపీడీవో, కమిషనర్ల లాగిన్ నుంచి సంబంధిత బ్యాంక్ మేనేజర్ల లాగిన్‌లోకి పంపిస్తారు.

గత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలను పూర్తిగా గాలికి వదిలేసింది. ప్రభుత్వం వచ్చిన తర్వాత బీసీ, మైనార్టీ, కాపు, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, మేదర, కుమ్మరి కులాల యువతీ యువకులు ఉపాధికోసం రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ, కాపు కార్పొరేషన్ ప్రకటన విడుదల చేయడంతో ఆనందం వ్యక్తం చేశారు. కొత్తగా జనరిక్ షాపులకు అవకాశం కల్పించారు.

సామాజికవర్గాల వారీగా..

జిల్లాలోని బీసీ కులాలకు.. బీసీ కార్పొరేషన్ ద్వారా జిల్లావ్యాప్తంగా అన్ని కులాల వారికి సెల్ఫ్ ఫైనాన్స్ జనరిక్ కలిపి రూ.45.94కోట్లతో 2198యూనిట్లు లక్ష్యంగా 1767 సెల్ఫ్‌ఫైనాన్స్ యూనిట్లకుగాను 31098 దరఖాస్తులు వచ్చాయి. జనరిక్ షాపులకు 33 యూనిట్లకుగాను 50దరఖాస్తులు వచ్చాయి. మేదరి, కమ్మరి, శాలివాహన కులాలనుంచి 114 యూనిట్లకుగాను 176 దరఖాస్తులు వచ్చాయి. ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాలకు సంబంధించిన సెల్ఫ్ ఫైనాన్స్‌కు 130 యూనిట్లకుగాను 2428దర ఖాస్తులు వచ్చాయి.జనరిక్ ఈబీసీ 3యూ నిట్లు, కమ్మ 5యూనిట్లు, రెడ్డి 5, ఆర్యవైశ్య 3, క్షత్రియ 2, బ్రాహ్మణ 6 కేటాయించారు.

కాపు కార్పొరేషన్ ద్వారా జిల్లావ్యాప్తంగా అన్ని కులాల వారికి సెల్ఫ్ ఫైనాన్స్, ఎంఎస్ఎంయు గ్రూప్స్‌కి రూ.28.24కోట్లతో763 యూనిట్లు లక్ష్యంగా నిర్ధారించారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు సెల్ఫ్ ఫైనాన్స్‌కు 751 యూనిట్లకుగాను 21,136 దరఖాస్తులు వచ్చాయి. గ్రూపు 12 యూనిట్లుగా 34 దరఖాస్తులు అందాయి.

టైలరింగ్, ట్రైనింగ్ ప్రోగ్రామ్స్

బీసీ, ఈడబ్ల్యుఎస్, కాపు ఉమెన్స్‌కి టైలరింగ్, ట్రైనింగ్ ప్రోగ్రాంకి రూ.9.48కోటతోట 3789 యూనిట్లకుగాను 26957 దరఖాస్తులు అందినట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ తెలిపారు.

పరిశీలన



అసౌకర్యాల చెరలో బోడసకుర్రు గృహాలు

తాగునీరు.. డ్రైనేజీ సమస్యలు

(అమలాపురం -ఆంధ్రజ్యోతి)

గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టిడ్కో గృహ సముదాయాలు నేడు అసౌకర్యాల చెరలో చిక్కుకుపోయాయి. వైసీపీ ప్రభుత్వం ఈ భవనాలకు రంగులు అయితే మార్చిందిగానీ నివాస గృహాల యజమానులకు అవసరమైన కనీస సౌకర్యాలపై దృష్టి సారించకపోవడంతో ప్రస్తుతం ఆయా టిడ్కో గృహాల్లో నివశిస్తున్న నివాసితులు నిరంతరం కష్టాలతోనే జీవనం గడుపుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో అమలాపురంలో 2017లో టిడ్కో గృహాల సముదాయానికి అప్పటి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. అయితే నిర్మాణంలో జాప్యం వల్ల లబ్ధిదారులు ఎంపికైనప్పటికీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని లబ్ధిదారులకైతే అందించారుగానీ అక్కడ కనీస సౌకర్యాల కల్పన చేపట్టలేదు. అమలాపురం పట్టణానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న అల్లవరం మండలం బోడసకుర్రు శివారు దేవర్లంక బ్లోఅవుట్ సైట్ సమీపాన 2017లో 1632 టిడ్కో గృహాలను నిర్మించి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని లబ్ధిదారులకు 1576 గృహాలను అందించారు. వాటిలో ఇంకా 56 గృహాలను అర్హులకు అందించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 550 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటుండగా వెయ్యికి పైగా గృహాలు తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. ఇక సెకండ్ ఫేజ్‌లో 962 ఇళ్లు నిర్మించాల్సి ఉన్నప్పటికీ ఆ ప్రతిపాదనను ప్రభుత్వం దాదాపు విరమించుకున్నట్టే. ఇక్కడ మంచినీటి సమస్యతో డ్రైనేజీ సమస్య ఉంది. తాగునీరు లేకపోవడంతో అక్కడ నివాసం ఉండేందుకు ఎవరూ వెళ్లడం లేదు. పదిరోజులకోసారి బోడసకుర్రు టిడ్కో గృహాలకు మున్సిపల్ వాటరు ట్యాంకరు ద్వారా నీళ్లు పంపిస్తున్నారు. జనసేన నుంచి ఒక ట్యాంకరు ద్వారా నీళ్లు అందిస్తున్నారు. ప్రస్తుతం ఉంటున్న వారికి టిడ్కో గృహాల వద్దే రేషన్‌ను తీసుకునే సదుపాయం కల్పించినా పెన్షన్లు మాత్రం అమలాపురం పట్టణంలో వారి వారి వార్డులకు వెళ్లి 1వ తేదీన తీసుకోవాల్సిందే.

పిఠాపురంలో అసౌకర్యాల చెరలో టిడ్కో ఇళ్లు



(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

అపార్ట్‌మెంట్లల్లో నివాసముంటున్న వారు ఇక్కడకు ఎందుకు వచ్చామా అని బాధపడుతుంటే, ఇంకా రానివారు అక్కడ నివసించకుండానే వడ్డీల మోత, బ్యాంకు రుణాల వాయిదాల వాతతో ఇక్కట్లు పడుతున్నారు. పిఠాపురం పట్టణంలోని గోర్సరోడ్డులో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 864 టిడ్కో అపార్ట్‌మెంట్లును నిర్మించారు. 2019 అసెంబ్లీ ఎన్నికలకు ముందు లాటరీ నిర్వహించి లబ్ధిదారులకు ఫ్లాట్లు అప్పగించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అంతా రివర్సయింది. ఏ సౌకర్యాలు కల్పించకుండానే 2024లో మరోమారు అపార్ట్‌మెంట్ల అప్పగింత ప్రక్రియ నిర్వహించారు. సుమారు 450మంది లబ్ధిదారులు బ్యాంకు రుణాలు పొందేందుకు అర్హత సాధించగా, వీరిలో 380 మందికి మాత్రమే ఫ్లాట్లు అప్పగించారు. కానీ ఇక్కడ తాగునీరు లేదు. ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నా అది వారి అవసరాలకు సరిపోవడం లేదు. ఎక్కడిక్కడ పైపులైన్ల లీకేజీలు, కరెంటు లోవోల్టేజీ, వీధిలైట్ల నిర్వహణ అంతంతమాత్రంగా ఉండడం, తలుపులకు చెదలు పట్టడం వంటి సమస్యలు ఉన్నాయి. రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం మూడేళ్లు సాగుతూనే ఉంది.



కాకినాడలోనూ అంతే..

కాకినాడ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పర్లోవపేటలో టిడ్కో గృహ సముదాయం ఉంది. ఇక్కడ తొలిఫేజ్‌లో 1152ఇళ్లు నిర్మించగా వాటిని లబ్ధిదారులకు అప్పగించారు. రెండో ఫేజ్‌లో 800 ఫ్లాట్లు నిర్మించగా లబ్ధిదారులకు అందించలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వీటి నిర్మాణం జరిగినా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిపట్ల పూర్తి నిర్లక్ష్యం వహించింది. దీంతో ఇప్పటివరకు తాగునీటి పైప్‌లైన్లు, అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు వంటి సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించలేదు. ఈ సముదాయంలోని వాటర్ సంప్ పరిసరాలు అపరిశుభ్రంగా మారగా, సీవేజ్ వాటర్ డ్రెయిన్ దెబ్బతింది. ఇక ఏ వస్తువు కావాలన్నా దూర ప్రాంతానికి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు మహిళా మార్ట్ భవనం నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది.



వాలుతిమ్మాపురంలో ఎదురుచూపులే..

పెద్దాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం వాలుతిమ్మాపురంలో నిర్మించిన టిడ్కో భవనాలు రెండో విడత కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. మొదటి విడతలో 1724 ఇళ్లను అప్పట్లో టీడీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు అందించింది. రెండో విడతలో 1672 ఇళ్లను నిర్మించింది. ఈలోపు వైసీపీ ప్రభుత్వం రావడంతో టిడ్కో ఇళ్లను పట్టించుకోలేదు. దీంతో రెండో విడతలో నిర్మించిన టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించలేదు. 500 ఇళ్లకు వైరింగ్ చేయాల్సి ఉంది.

సామర్లకోటలో మోక్షం ఎప్పుడో..



సామర్లకోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గడిచిన తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఫ్లాట్లను లబ్ధిదారులకు అప్పగించకుండా తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ముప్పుతిప్పలు పెట్టింది. దాంతో టిడ్కో గృహాలు శిథిలావస్థకు చేరాయి. సామర్లకోటలో జగ్గమ్మగారిపేట, ఉప్పువారిసత్రం రోడ్లలో 1,054 ఫ్లాట్లను అప్పట్లో తెలుగుదేశం ప్రభుత్వం నిర్మించింది. కూటమి ప్రభుత్వం రావడంతో ఇప్పటికైనా టిడ్కో గృహాలు తమ వశం అవుతాయని వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. కానీ తొమ్మిది నెలలు అయినా టిడ్కో ఫ్లాట్ల ఊసే ఎత్తకపోవడంతో లబ్ధిదారుల్లో తీవ్ర నిరాశానిస్పృహలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్లాట్ల వద్ద కనీసం మౌలిక సదుపాయాలు సైతం కల్పించలేదు. వినియోగంలో లేకపోవడంతో పిచ్చిమొక్కలతో ఆ ప్రాంతం అస్తవ్యస్తంగా మారింది. ఇక తుని సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల దుస్థితీ ఇంతే.

జిల్లాలో 7725 గృహాల నిర్మాణానికి చర్యలు

హౌసింగ్ పీడీ సత్యనారాయణ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది 7725 గృహాల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు జిల్లా హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక వెలుగుకార్యాలయంలో బుధవారం ప్రత్తిపాడు నియోజకవర్గ గృహనిర్మాణ శాఖాధికారులు, సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 3211గృహాల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మిగిలిన 4514 గృహ నిర్మాణ పనులు లబ్ధిదారులు వెనువెంటనే చేపట్టేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. గృహనిర్మాణ లబ్ధిదారుల వద్దకు వెళ్లి నగదు జమైనా పనులు చేపట్టని వారి ఇళ్ల నిర్మాణానికి సమాయత్తం చేయాలని సూచించారు. జిల్లా హౌసింగ్ ఈఈ గుప్తా మాట్లాడుతూ ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, కొండలపై నిర్మించే గృహాలకు రూ.లక్ష వంతున రాయితీలు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో గృహ నిర్మాణపనులు వేగవంతం చేయాలన్నారు. ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, హౌసింగ్ డీఈ సువర్ణరాజు, ఏపీవో కుమార్‌స్వామి, ఏపీఎం వై.వెంకట్, ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాథ్, ఏఈలు పాల్గొన్నారు.

నేటినుంచి 'పది' పరీక్షా పత్రాల మూల్యాంకనం

కాకినాడరూరల్,ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షాపత్రాల మూల్యాంకనం ప్రక్రియ గురువారం ప్రారంభం కానుందని డీఈవో పి.రమేష్ తెలిపారు. ఈనెల 9 వరకూ ఈప్రక్రియ కొనసాగుతుందని మొత్తం 2లక్షల స్క్రిప్టులను మూల్యాంకనం చేయనున్నారన్నారు. 713మంది ఏఈలు, 119మంది సీఈలు, 238మంది పాఠశాల సహాయకులు మూల్యాంకనంలో పాల్గొంటున్నారని తెలిపారు. కాకినాడ సాలిపేటలోని మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాలలో జరిగే పరీక్షా పత్రాల మూల్యాంకనానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.

ఫ్యాన్‌కు ఎదురు గాలి..

- సామర్లకోట వైసీపీలో ముసలం
- చైర్‌పర్సన్‌ను మార్చాలని కౌన్సిలర్ల పట్టు
- కలెక్టర్‌ను కలిసి లేఖ అందజేత

(కాకినాడ/సామర్లకోట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని మున్సిపాలిటీల్లో వైసీపీకి ఎదురుగాలి వీస్తోంది. ఇటీవల తుని మున్సిపాలిటీని మెజారిటీ ఉండి చేజార్చుకోగా, తాజాగా సామర్లకోట మున్సిపాలిటీలో అంతర్గత కుమ్ములాట చైర్‌పర్సన్ కుర్చీకి ఎసరుపెట్టే వరకు వెళ్లింది. బుధవారం సామర్లకోట మున్సిపాలిటీకి చెందిన మెజారిటీ వైసీపీ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి చైర్‌పర్సన్‌ను మార్చాలని లేఖ అందజేయడంతో రాజకీయం వేడెక్కింది. పిఠాపురం మున్సిపాలిటీలోను అంతర్గతంగా వైసీపీలో కుమ్ములాట కొనసాగుతోంది. చైర్‌పర్సన్‌ను మార్చాలని ఓ వర్గం పట్టుబడుతుండగా, మరోవర్గం నిలబెట్టే ప్రయత్నం చేస్తోంది.

నాలుగేళ్ల క్రితం ఎన్నికలు

జిల్లాలోని తుని, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం మున్సిపాలిటీల్లో 2021, మార్చి 10న ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అప్పటి వైసీపీ ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల్లో పాగా వేసింది. పెద్దాపురం మున్సిపాలిటీలో మొత్తం 30మంది కౌన్సిలర్లకు 26మంది వైసీపీ, జనసేన ఒకరు, టీడీపీ ఇద్దరు గెలిచారు. పిఠాపురం మున్సిపాలిటీలో మొత్తం 30 మంది కౌన్సిలర్లకుగాను 20మంది వైసీపీ గుర్తుపైన, నలుగురు స్వతంత్రంగా గెలిచి వైసీపీ కండువా కప్పుకొన్నారు. దీంతో వైసీపీ బలం 24కు చేరింది. టీడీపీలో ఆరుగురు గెలవగా, 23వవార్డు కౌన్సిలర్ చనిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైసీపీ 24 మందిలో ఆరుగురు జనసేన కండువా కప్పుకొన్నారు. ప్రస్తుతం వైసీపీలో ఉన్న 18మందిలో ఆరుగురు జనసేనలోకి చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కడ ఎందుకో కూటమి ప్రభుత్వం ఆ మున్సిపాలిటీని కైవసం చేసుకునేందుకు మీనమేషాలు లెక్కిస్తోంది.

తునిలో యనమల వ్యూహం

కూటమి ప్రభుత్వం తుని మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టిసారించింది. ఇక్కడ 30కి 30 మంది వైసీపీ కౌన్సిలర్లు ఉండగా.. చైర్‌పర్సన్ పీఠాన్ని కైవసం చేసుకునేలా మాజీ మంత్రి యనమల వ్యూహం రచించారు. రెండు సార్లు కోరం లేకుండా చేయడం, చైర్‌పర్సన్‌ను రాజీనామా చేయించేలా ఒత్తిడి తేవడం, వైసీపీ నుంచి కొందరు టీడీపీలోకి రావడంతో తుని మున్సిపాలిటీ కూటమి పరమైంది.

సామర్లకోట చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానానికి అనుమతి కోరుతూ లేఖ



చైర్‌పర్సన్ అరుణ(పాతచిత్రం)

ప్రస్తుతం సామర్లకోట మున్సిపాలిటీలో వైసీపీలోనే చైర్‌పర్సన్‌ను మార్చాలనే డిమాండ్ తలెత్తింది. ఇక్కడ వైసీపీ 29మంది, టీడీపీ కౌన్సిలర్లుగా ఇద్దరు గెలిచారు. ప్రస్తుతం వీరిలో అంతర్గత కుమ్ములాటలు రచ్చకెక్కుతున్నాయి. మెజారిటీ సభ్యులు చైర్‌పర్సన్‌ను మార్చాలనే డిమాండ్‌ను వినిపిస్తున్నారు. ఈ మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానానికి అనుమతి కోరుతూ బుధవారం 22మంది వైసీపీ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలికి లేఖ అందించారు. కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఈ లేఖ అందించాలని సూచించినట్టు సమాచారం. దీంతో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఊబా జాన్ మోసెస్, వైసీపీ కౌన్సిలర్లు పాగా సురేష్, ఆవాల లక్ష్మీనారాయణ, యార్లగడ్డ జగదీశ్, నేతల హరిబాబు మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యను కలిసి ఆమెకు వినతిపత్రం అందించారు. రెండునెలలుగా సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పునకు మంతనాలు సాగిస్తున్నట్టుగా వస్తున్న వార్తలకు బుధవారం జరిగిన ఘటన బలం చేకూర్చింది.

పంచప్రాధాన్యాల పేరుతో 3నెలలపాటు ఉపాధి

- గ్రామాల్లో ఉపాధి కూలీలకు పనులు: డ్వామా పీడీ

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వచ్చే మూడు నెలలపాటు కూలీలకు పనికల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం పంచ ప్రాధాన్యాల పేరిట గ్రామాల్లో పనులుకల్పించనుందని డ్వామా పీడీ వెంకటలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దిశానిర్దేశంలో ఏప్రిల్, మే, జూన్‌నెలల్లో పంచప్రాధాన్యాల పేరున ఐదు అంశాలతో ముందుకు వెళ్లనుందన్నారు. కలెక్టర్ నేతృత్వంలో ఈ కింది పనులతో జిల్లావ్యాప్తంగా వేసవి ప్రణాళిక సిద్ధం చేయడమేకాకుండా రోజుకురూ.300 కూలీ పొందేలా చర్యలు చేపడుతున్నారు. 2024-25 సంవత్సరంలో ఎన్ఆర్ఈజీఎస్ సాధించిన ప్రగతి మొత్తం పని దినాల లక్ష్యం 78లక్షలుకాగా ఇప్పటివరకు కల్పించిన పనిదినాల సంఖ్య 75లక్షలు, సీసీ రోడ్లు, బీటీరోడ్లు 146.57కిమీ నిర్మాణానికి రూ.86.52కోట్లు ఖర్చు చేశారన్నారు. 679 ఎకరాల్లో పండ్ల తోటల్లో మొక్కలు నాటారన్నారు. 2025-26 సంవత్సరంలో జూన్ వరకు లక్ష్యాలు పంచప్రాధాన్యాలు, పశువులకు నీటి తొట్టెలు, వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు ప్రతి గ్రామంలో పశుసంవర్ధకశాఖ అధికారులతో కలిసి రెండు వారాల్లో నీటి తొట్టెలు, ఎక్కడెక్కడ అవసరమో గుర్తించి ఏప్రిల్‌లోగా నిర్మిస్తామన్నారు. సేద్యపు నీటి కుంటలు వర్షాకాలంలో నీటిని ఒడిసి పట్టేందుకు ప్రతిరైతు తన పొలంలో సేద్యపు గుంటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వచ్చే మూడునెలల్లో పంట కుంటలు విరివిగా తవ్వించాలని లక్ష్యంగా నిర్దేశించారు. కాలవల్లో పూడికతీత పూడికతో కూడిన సప్లయ్ చానల్స్‌లో ఉపాధి హామీ కింద పనులు చేపట్టి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోనున్నామన్నారు. కూలీలకు రూ.300 వరకు కూలీ దక్కేలా పనులు చూపనున్నారు. 4 గంటలు పనిచేస్తే కూలీ గిట్టుబాటయ్యేలా కొలతలతో మార్కింగ్ ఇస్తామన్నారు.

వేసవి అలవెన్స్.. లేనట్టేనా?

- మండుతున్న ఎండలు
- విడుదలకాని ఉపాధి మార్గదర్శకాలు
- వేతనదారులకు వేతనం గిట్టుబాటయ్యేనా?



ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు(ఫైల్)

పెద్దాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ వేతనదారులకు వేసవి అలవెన్స్ ప్రశ్నార్థకంగా మారింది. ఇంతవరకూ మార్గదర్శకాలు విడుదల కాకపోవడమే ఇందుకు కారణం. వాస్తవంగా ఏటా జనవరిలోనే అలవెన్స్‌ను ప్రకటించేవారు.కానీ ఈసారి ఏప్రిల్ వచ్చినా ఇంతవరకు ఆ ఊసే లేదు. మరోవైపు వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిన నేపథ్యంలో వేతనదారులు పనిప్రదేశంలో తీవ్రఇబ్బందులు పడుతున్నారు. కాగా ఉపాధి వేతనదారులకు కనీస వేతనం రూ.300కు తగ్గకుండా చూడాలని కేంద్రం మార్గదర్శకాలు విడుదల చేసింది. అందులోనే వేసవి అలవెన్స్ ఉంటుందని పలువురు చెప్తున్నారు. మరోవైపు మార్చినెల పూరికావస్తోంది. దీంతో ఈఏడాది ఉపాధి వేతనదారులకు వేసవి అలవెన్స్ లేనట్లే అని కొంతమంది అధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో వేతనదారులకు వేసవిలో రూ.300 వేతనం కచ్చితంగా గిట్టుబాటయ్యేనా అనే సందేహం వ్యక్తమవుతోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 21మండలాల్లో 2,86,589 జాబ్‌కార్డులున్నాయి. వేసవిలో ఉపాధి పనులు చేయడం కష్టంగా ఉంటుందని భావించిన ప్రభుత్వాలు గతంలో ఫిబ్రవరిలో 20శాతం, మార్చిలో 25శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30శాతం, జూన్‌లో 20శాతం వరకూ పనుల పరిమాణం తగ్గించి 100శాతం పనికి వేతనం అందించేవారు. అంటే వేసవిలో నేల గట్టిగా ఉండడంతో పని తక్కువగా జరిగినా వేసవి అలవెన్స్‌తో కలిపి వేతనం ఇచ్చేవారు. దీంతో వేతనదారులకు కూలీ గిట్టుబాటు అయ్యేది.

ముగిసిన ఆర్థిక సంవత్సరం

ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో చెరువుల్లో పూడికతీత, నీటి కుంటలు, పంట కాలువలు తవ్వకం వంటి పనులు చేపడుతున్నారు. ప్రభుత్వం ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంపకం వంటి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రెండురోజుల క్రితమే ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఈనెలనుంచి మరిన్ని పనదినాలు పెంచుతున్నారు. 50మంది వేతనదారులను తీసుకొచ్చే ప్రతి మేట్‌కు రూపాయిన్నర వంతున అదనపు వేతనం అందిస్తారు. కాగా వేతనదారులకు వేసవి అలవెన్స్ విషయమై డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మిని వివరణ కోరగా వేతనదారులకు ప్రస్తుతం వేసవి అలవెన్స్ విషయమై ఎటువంటి ఆదేశాలు రాలేదని, వేతనదారుల పనిచేసే సమయాన్ని 11 గంటల్లోపే ముగిస్తున్నామని తెలిపారు.

కొంగలు... కాదండీ!



ఈ చెట్టును చూశారా.. చెట్టుకు కొంగలు కాసినట్టు ఉంది కదా!.. అటుగా వెళ్లే వాళ్లు ఆగి ఆశ్చర్యంగా చూస్తున్నారు. కానీ ఇవి కొంగలు కాదు. బూరుగు కాయలు. వేసవిలో ఆకులన్నీ రాలిపోవడంతో దూరం నుంచి ఈ బూరుగు కాయలు కొంగల్లా కనిపిస్తూ కళ్లకు పరీక్ష పెడుతున్నాయి మరి! తూర్పు గోదావరి జిల్లా కడియపులంక వద్ద జాతీయ రహదారి పక్కన ఈ చెట్టు కనువిందు చేస్తోంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



అదిరే ఎండ... బొమ్మలే అండ



ఎండలు మండుతున్నాయి... రోడ్లపై జన సంచారం తగ్గుతోంది... కాళ్లరిగేలా తిరిగినా కొనేవారే కరువయ్యారు... చేసేదేముంది... కాకినాడ శాంతినగర్‌లో అలసి సొలసిన ఓ విక్రయదారుడు ఆ బొమ్మల నీడనే కాస్త విశ్రాంతి తీసుకుంటూ ఇలా కనిపించాడు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

నల్లమట్ట... చిక్కిందోచ్!

కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ నుంచి బుధవారం తెల్లవారు జామున సముద్రంపై వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రసాద్ వలకు అరుదైన నల్లమట్ట చేప చిక్కింది. సుమారు 20 కిలోల బరువున్న ఈ చేపకు మినీ హార్బర్ దగ్గర వేలంపాట నిర్వహించగా కాకినాడకు చెందిన టోకు వ్యాపారస్తుడు రూ.6వేలకు పాడుకున్నాడు. సముద్రంలో చాలా అరుదుగా దొరికే ఈ చేప రుచి అమోఘంగా ఉంటుందని మత్స్యకారులు చెప్తున్నారు.

- కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)



సత్యవాడ... నవమి శోభ

- శ్రీరామ నవమి ఉత్సవాలకు ముస్తాబవుతున్న గ్రామం
- భద్రాచలంలో మాదిరిగానే చలువ పందిళ్లలో సీతారాముల కల్యాణం
- పూల కుండీలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్న గ్రామస్తులు

ఆధ్యాత్మిక వాడగా పేర్గాంచింది సత్యవాడ. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరంలోని ఈ గ్రామం శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ప్రతిచోటా శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తారు. కానీ ఇక్కడ జరిగే ఉత్సవాలకు ఓ ప్రత్యేకత ఉంది. భద్రాచలంలో జరిగే విధంగానే ఇక్కడా సీతారాముల కల్యాణం జరుపుతారు. అక్కడ మాదిరిగానే ఆరు బయట చలువ పందిళ్లు వేసి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ప్రతి ఇంట్లోనూ ఆడపడుచులను, బంధువులను ఆహ్వానించి తమ ఇంట్లో పెళ్లి మాదిరిగా స్వామివారి కల్యాణం జరుపుతారు.



చెరువు వీధిలో సీతారాములు

కె.గంగవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సత్యవాడ గ్రామంలోని చెరువు వీధి, పెద్ద వీధి, కొత్తపేట వీధుల్లో చలువ పందిళ్లలోను, రామయ్య వీధి, బీసీ, ఎస్సీ కాలనీలు, గ్రామ శివారు ఖండ్రిక, రాయిచెరువుల్లోని ఆలయాల్లో కల్యాణోత్సవాలు నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి తిలకిస్తారు. తలంబ్రాలు సమయంలో వాటిని ఒడిసి పట్టి ఇళ్లకు తీసుకెళ్తారు. పిల్లలు లేనివారు వాటిని కొన్ని తలపై వేసుకుని, పూజా మందిరంలో పెట్టి పూజిస్తే సంతానం కలుగుతుందని నమ్ముతున్నారు. ఇలా కొంతమందికి జరిగిందని గ్రామస్తులు చెప్తున్నారు. విద్యార్థులు కల్యాణంలో పాల్గొని స్వామిని పూజిస్తే మంచి విజయాలు సాధిస్తారని ఇక్కడి వారి నమ్మకం. ప్రస్తుతం చలువ పందిళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది.

ఇక్కడ చలువ పందిళ్లను ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఒక్కో చలువ పందిరి డెకరేషన్‌కు రూ.3 లక్షలు నుంచి రూ.5 లక్షలు ఖర్చు చేస్తారు. అలంకరణ కోసం గ్రామంలోని ప్రతి ఒక్కరూ రేయింబవళ్లూ కష్టపడతారు. మహా శివరాత్రి పర్వదినం నుంచి పందిళ్లలో అలంకరించే పూల కుండీల తయరీలో నిమగ్నమవుతారు. ఉగాది నుంచి పందిళ్ల నిర్మాణం చేపడతారు. పూల కుండీలు ప్రత్యేక ఆకర్షణ. ప్రత్యేకంగా విజయవాడ నుంచి తీసుకుని వచ్చిన క్రేప్, గున్న పేపరు, వార్నిష్ పేపరుతో గులాబీ, చామంతి, మందారం, మల్లె, పొద్దుతిరుగుడు, నైట్‌క్వీన్ వంటి పూలను కాగితాలతో తయారు చేస్తారు. 50-60 పూలతో ఒక కుండీని తయారు చేస్తారు. ఒక్కో పందిరిలో సుమారు 50 కుండీలు, అంత కంటే ఎక్కువ అలంకరిస్తారు. ఇవి సహజమైన పూల మాదిరిగా చూపరులను ఆకట్టుకుంటాయి.



తయారైన పూల కుండీలు



పూల కుండీ తయారు చేస్తున్న యువకుడు



ఆకర్షణీయంగా కాగితం పువ్వు



కొత్తపేట వీధిలో కొలువైన సీతారాములు



నైట్‌క్వీన్ పూల కుండీ



సీతారాముల కల్యాణానికి నిర్మించిన చలువ పందిరి

సత్యవాడలో సీతారాముల కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయడానికి గ్రామస్తులంతా శ్రమదానం చేస్తారు. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అందరూ పందిరి అలంకరణలో పాల్గొంటారు. చందాలు వేసుకుని, కావాల్సిన ముడిసరుకు కొనుగోలు చేసి పూల కుండీలు తయారు చేస్తారు. దీనికోసం కొంత సమయం కేటాయిస్తారు.

ఈ నెల 6వ తేదీన సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చకచకా జరుగుతు న్నాయి. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. గ్రామాల్లో వీధుల్లో లైటింగ్ పెడుతున్నారు.



తెల్ల మందారం పూల కుండీ



పొద్దుతిరుగుడు పూల కుండీ



గులాబీ, కనకాంబరం, సంపెంగ పూల కుండీలు

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న

దివాన్‌చెరువు యువకుడు

- బబ్లూ వేసిన వేంకటేశ్వరస్వామి చిత్రం

దివాన్‌చెరువు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువుకు చెందిన యువకుడు బబ్లూ డాంగి బియ్యపు గింజలతో వేసిన తిరుపతి వెంకటేశ్వరస్వామి చిత్రం ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం దక్కించుకుంది. ఈసందర్భంగా బబ్లూ ఆంధ్రజ్యోతితో బుధవారం ఫోన్‌లో మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌కు చెందిన తమ కుటుంబం దాదాపు 27 సంవత్సరాలుగా దివాన్‌చెరువులోనే నివాసం ఉంటోందన్నారు. తన తండ్రి దివాన్‌చెరువులో పానీపూరి అమ్ముతారని తాను ప్రస్తుతం ఢిల్లీలోని కళాశాలలో ఫైన్ ఆర్ట్స్ అభ్యసిస్తున్నానన్నారు. తనకు చిన్నతనం నుంచి చిత్రలేఖనం అంటే ఎంతో ఇష్టమని, తమ తల్లిదండ్రుల సహకారం, మామయ్య ప్రోత్సాహంతో తాను ఆ రంగంవైపు దృష్టి సారించానన్నారు. తనచెల్లెలు ఇంటర్ రెండో సంవత్సరం అభ్యసిస్తున్నారని చెప్పారు. తాను బాస్మతి బియ్యం, ఎకరిలిక్ రంగులు, ఫెవికాల్ ఉపయోగించి రెండు అడుగుల వెంకటేశ్వరస్వామి చిత్రాన్ని వేశానని చెప్పారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఈచిత్రం స్థానం దక్కించుకోవడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఇదేవిధంగా తాను గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డులో కూడా స్థానం దక్కించుకోవాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని చెప్పారు.



ఇండియన్ బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న బబ్లూ వేసిన చిత్రం

6న ర్యాలి కేశవస్వామి కల్యాణం

- కేశవ దీక్షలు చేపట్టిన 300 మంది

ఆత్రేయపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పురాన ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి వార్షిక కల్యాణోత్సవం ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకూ వైభవంగా నిర్వహించనున్నారు. 6న స్వామివారి కల్యాణం వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించనున్నారు. మంగళవారం కల్యాణోత్సవం పోస్టర్‌ను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆవిష్కరించారు. అనంతరం తొలి ఆహ్వాన పత్రికను ఈవో బీహెచ్వీ రమణమూర్తి ఎమ్మెల్యే సత్యానందరావుకు అందజేశారు. స్వామివారి ఆలయంలో సుమారు 300 మంది భక్తులు కేశవమాల దీక్షను ధరించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులు మాలధరించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఉచితంగా ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. కల్యాణోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి కల్యాణోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

అవాంటెల్‌తో జేఎన్టీయూకే ఎంవోయూ

జేఎన్టీయూకే, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని యూసీఈకే ఈసీఈ విభాగం ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్స్‌లో కొలాబోరేటివ్ ప్రోగ్రామ్ నిర్వహించేందుకు అవాంటెల్ లిమిటెడ్ కంపెనీతో బుధవారం ఉదయం వీసీ సమావేశహాల్లో ఎంఓయూ కుదుర్చుకుంది. ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ యూసీఈకే ఒక ప్రముఖ విద్యా సంస్థగా పేరొందడంతోపాటు పూర్వ విద్యార్థులు భారతదేశం, విదేశాలలో చాలా కీలకమైన స్థానాలలో ఉన్నారన్నారు. ఈసీఈ విభాగంలో ఏర్పాటుకానున్న సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్స్ స్పెషలైజేషన్ కోర్సు విజయవంతమవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అవాంటెల్ ఛైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ తమ కంపెనీ విశాఖపట్నం, హైదరాబాద్‌లలో మూడు దశాబ్దాలపాటూ భారత రక్షణసేవలు, అనుబంధ సంస్థలకు ప్రత్యేకమైన ఉత్పత్తులను అందిస్తున్నామన్నారు. ప్రతిఏటా 25మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఐఐఐటీ డైరెక్టర్ బీటీ కృష్ణ, విద్యాసాగర్, శ్రీనివాసరావు ఎంవోయూపై సంతకాలు చేయగా వీసీ ప్రసాద్, అవాంటెల్ ఛైర్మన్ విద్యాసాగర్ అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, మాజీ వీసీలు జీవీఆర్ ప్రసాద రాజు, పద్మరాజు, శ్రీనివాసకుమార్, ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్ పి.ఉదయభాస్కర్, ఓఎస్డీ కోటేశ్వరరావు, డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వీసీ ప్రసాద్, అవాంటెల్ ఛైర్మన్ విద్యాసాగర్

ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అని, వాళ్ల తరఫున వాదించడానికి న్యాయవాది లేకపోతే జిల్లా న్యాయ సేవాధికారం సంస్థ(డీఎల్ఎస్ఏ) ద్వారా నియమిస్తామని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఆమె కేంద్ర కారాగారాన్ని, మహిళా ప్రత్యేక కారాగారాన్ని సందర్శించారు. వసతి సదుపాయాలు, ఆహారాన్ని పరిశీలించారు. ఖైదీల సమస్యలను ఎప్పటికప్పుడు సంస్థ దృష్టికి తీసుకురావాలని పారా లీగల్ వలంటీర్లను ఆదేశించారు. అనాలోచిత పనులవల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, చెడు స్నేహాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఖైదీలకు హితవు పలికారు.

ఉత్తమ నాటిక ప్రదర్శనలకు

బహుమతుల ప్రదానం



ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన స్వేచ్ఛ నాటిక కళాకారులకు బహుమతి అందిస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

రావులపాలెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీ కాటన్ కళాపరిషత్ వేదికపై మూడు రోజులపాటు నిర్వహించిన నాటిక పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన మూడు నాటికలకు బహుమతులను అందజేశారు. ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా విశ్వశాంతి కల్చరల్ వారి స్వేచ్ఛ నాటిక, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా సాయి ఆర్ట్స్‌వారి జనరల్ బోగీలు, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా మైత్రి కళా నిలయం వారి బ్రహ్మస్వరూపం నాటికలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచాయి. దీంతో శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కాటన్ కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ సినీ రచయిత తనికెళ్ళ భరణి, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లమల్లి వీరరాఘవ రెడ్డి, పలివెల త్రిమూర్తులుతోపాటు సీఆర్సీ కార్యవర్గ సభ్యులు బహుమతులు, ప్రశంసా పత్రాలు ఆయా నాటిక కళాకారులకు అందజేశారు.

అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనకు

చురుగ్గా ఏర్పాట్లు: కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనను వేడుకగా నిర్వహించడానికి రాష్ట్ర సాంస్కృతికశాఖ, నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకూ సెంట్రల్ జైలు రోడ్డులో నిర్వహించే వేడుకల్లో భాగంగా 500 ప్రదర్శనలకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. సమన్వయాధికారిగా మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనలను తిలకించాలని ఆమె కోరారు.



చిత్రకళాప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

స్నానానికి వెళ్లి...శాశ్వతంగా దూరమై!

● కాకినాడ జిల్లాలో విషాద ఘటనలు
● కాండ్రకోట ఏలేరు కాలువలో స్నానానికి దిగి ఇద్దరి మృతి
● పెద్దనాపల్లి ఏలేరు కాలువలో మరణించిన ఇద్దరు యువకులు
● శోకసంద్రంలో కుటుంబసభ్యులు



కాండ్రకోటలో మరణించిన కొప్పాడి బాలు, నాగవిశాల్ వర్మ (ఫైల్ ఫొటోలు)


సంఘటనా స్థలం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పెద్దాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి దర్శనానికి వచ్చి ప్రమాదవశాత్తు ఏలేరు కాలువలో నీట మునిగి ఒకే కుటుంబానికి చెందిన యువకుడు, బాలుడు మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. యానాంకు చెందిన కొప్పాడ సత్తిబాబు, తిరమూడి రాజు కుటుంబాలు ఈ నెల 1న నూకాలమ్మ దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం సమీపంలోని ఓ తోటలో వంట వండుకుని కుటుంబ సమేతంగా అందరూ కలిసి భోజనాలు ముగించుకుని ఆనందంగా గడిపారు. ఇంతలో కొప్పాడ బాలు(20), తన మేనల్లుడు తిరుమాడి నాగవిశాల్ వర్మ (8) స్థానిక ఏలేరు కాలువలోకి స్నానానికి వెళ్లారు. సాయంత్రం అయిన వారు రాకపోవడంతో వారి కోసం ఎదురుచూసిన కుటుంబీకులు వారికి ఆచూకీ దొరకలేదు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలకు తెలియజేయడంతో స్థానిక పోలీసులకు వారు సమాచారం అందించారు. చీకటి పడిపోవడంతో మర్నాడు ఉదయాన్నే ఎస్ఐ మౌనిక, అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లతో ఏలేరు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈలోగా బాలుడు వర్మ మృతదేహం ఉదయం కనుగొన్నారు. బాలు మృతదేహం కోసం మరో 3 గంటలు వరకు పోలీసు, అగ్నిమాపక సిబ్బంది ఏలేరు కాలువలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టడంతో సాయంత్రానికి మృతదేహం లభ్యమైంది. 2 మృతదేహాలను శవపంచనామా నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బాలుకు తల్లితండ్రి తో పాటు చెల్లి హారిక ఉంది. ఆ కుటుంబాలు చిరు ఉద్యోగాలతో జీవనం సాగిస్తుండగా మృత్యువు కబళించడంతో ఆ కుటుంబ సభ్యులు పెట్టిన రోదన చూపరులను కంటతడి పెట్టించాయి. వర్మ నాల్గోతరగతి చదువుతూ మేనమామతో ఉంటున్నాడు. ఎనిమిదేళ్ల ప్రాయంలోనే మృత్యు వు కాటేయడంతో 2 కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.


పెద్దనాపల్లిలో మరణించిన జీవన్, తరుణ్


ఫైల్ ఫొటోలు

ఏలేశ్వరం/జగ్గంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి ఏలేరు నదిలో స్నానానికి వెళ్లి ఇద్దరు యువకులు మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో జరిగింది. జగ్గంపేట గ్రామానికి చెందిన దేవర జీవన్‌కుమార్ (19), మెల్లి వీరవెంకట దుర్గ అలియాస్ తరుణ్(19)లు మిత్రులతో కలిసి బుధవారం స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు కిర్లంపూడి- ఏలేశ్వరం సరిహదులో ఉన్న ఏలేరు కాలువలోకి దిగారు. అయితే జీవన్‌కుమార్, తరుణ్‌లు నీటిలో కొట్టుకుపోవడంతో తోటి స్నేహితులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న జగ్గంపేట సీఐ వైఆర్‌కె.శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటన ఏలేశ్వరం పరిధికి రావడంతో ఏలేశ్వరం ఎస్ఐ రామలింగేశ్వరరావుకు సమాచారం అందించగా ఆయన అక్కడ చేరుకున్నారు. జగ్గంపేటకు చెందిన మొత్తం ఏడుగురు యువకులు పెద్దనాపల్లి శివారులో ఏలేరు కాలువలో స్నానానికి వెళ్లగా ప్రమాదశాత్తు నీటిలో మునిగిపోవడంతో జీవన్‌కుమార్, తరుణ్ మృతి చెందినట్టు ఆయన తెలిపారు. వారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు చెప్పారు. యువకుల మృతితో జగ్గంపేటలోని యాదవపేటలో విషాదచాయలు అలముకున్నాయి. జీవన్ ఇటీవల ఇంటర్ పరీక్షలు పూర్తి చేశాడు. అతడి తల్లిదండ్రులు దేవర వాసు, వరలక్ష్మి. తాపీ పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్న కొడుకు మృతిచెందడంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు. తరుణ్ తండ్రి రాంబాబు దేవుడి బొమ్మలు తయారు చేస్తుంటాడు. చేతికి అంది వచ్చిన కొడుకు మృతిచెందడంతో తండ్రితో పాటు కుటుంబసభ్యులు తీవ్ర వేదన చెందుతున్నారు.

గోదావరి డెల్టాకు 7 వరకు నీటి విడుదల

ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు


డొంకరాయి జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సు నుంచి గోదావరి డెల్టా రబీ పంటలకు నీటి విడుదలను ఈ నెల 7వ తేదీ వరకు పొడిగించినట్టు ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు తెలిపారు. ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గోదావరి డెల్టా రబీ పంటలకు డొంకరాయి జలాశయం స్పిల్‌వే ద్వారా విద్యుత్ ఉత్పత్తి లేకుండా నేరుగా 5వేల క్యూసెక్కులు, పొల్లూరు జల విద్యుత్ కేంద్రం నుంచి 4300 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. డొంకరాయి జలాశయం ద్వారా ఫిబ్రవరి 10 నుంచి మార్చి 31 వరకు ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదలచేయాలని తొలుత కోరారన్నారు. అయితే రబీ పంటలకు ఇంకా నీటి అవసరం ఉన్న నేపథ్యంలో ఏప్రిల్ 7 వరకు డొంకరాయి నుంచి 5వేల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నట్టు చెప్పారు. ఫిబ్రవరి 10 నుంచి మార్చి 31 వరకు డొంకరాయి జలాశయం స్పిల్‌వే గేట్ల ద్వారా 14.468టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు ఆయన వివరించారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్‌లో ఆంధ్రా వాటా 33.1849 టీఎంసీలు, డొంకరాయి, గుంటవాడ (సీలేరు)జలశయాల్లో13.1061టీఎంసీలతో కలిసి మొత్తంగా సీలేరు కాంప్లెక్సుకు 46.2910 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్టు సీఐ వాసుదేవరావు తెలిపారు.

అన్ని కోణాల్లో నాగాంజలి కేసు దర్యాప్తు

కొంతమంది రాజకీయ లబ్ధికి ఈ సంఘటనను వాడుకోవడం సరికాదు : డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యకిషోర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆస్పత్రిలో ఫార్మాలజిస్ట్‌గా పనిచేస్తున్న నల్లపు నాగాంజలి ఆత్మహత్య యత్నం సంఘటనకు సంబంధించి ప్రకాష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు అన్ని కోణాల్లో దర్యాప్తు జరుగుతోందని డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. బుధవారం ప్రకాష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత నెల 24వ తేదీన ఆస్పత్రి డ్యూటీలో ఉన్న నాగాంజలి ఆత్మహత్య యత్నం చేసిందని ఆమె తండ్రి నల్లపు దుర్గారావు ఫిర్యాదు చేయడంతో క్రైమ్ నెంబర్ 54/2025 యూ/ఎస్ 74,79, 351(2), 226 బీ ఎన్ ఎస్ (354, 909, 506, 309 ఐపీసీ) 75,78, 115(2), 64, 108, ఆర్/డబ్ల్యు 56 బీఎన్ఎస్ (354-ఏ, 354-డీ, 323, 376, 306 ఆర్/డబ్ల్యు 116 ఐపీసీ) గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని తెలిపారు. ఈ కేసులో నిందితుడు దువ్వాడ మాధవరావుదీపక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. నాగాంజలి రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా ఈ కేసును రేప్ కేస్‌గా అల్టర్ చేసి సెక్షన్లు మార్పు చేసి ఆస్పత్రి సీసీ ఫుటేజ్ కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అలానే దీపక్‌ను సమగ్ర విచారణ చేసేందుకు పోలీస్‌కస్టడీకి ఇవ్వమని కోర్టును కోరడం జరిగిందన్నారు. నాగాంజలి ఆరోగ్య విషయం పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ ప్రభుత్వ డాక్టర్ల కమిటీని నియమించారని, ఆ కమిటీ నాగాంజలి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని తెలిపారు. ప్రస్తుతం నాగాంజలి వెంటిలేటర్ మీద ఉండటం, వెంటిలేటర్ తీసేసిన ఎడల ఆమె చనిపోవచ్చని వైద్యులు అప్రమత్తంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కేసు దర్యాప్తులో నిష్పక్షపాతంగా ఎటువంటి అనుమానాలకు, అపోహలకు తావు లేకుండా పూర్తి పారదర్శంగా దర్యాప్తు జరుగుతోందన్నారు. అయితే ఈ కేసు విషయంలో కొంతమంది రాజకీయ లబ్ధి కోసం నాగాంజలి ఆత్మాహత్య ఘటనను వాడుకుంటున్నారని, సరైన పద్ధతి కాదని డీఎస్పీ తెలిపారు. ప్రకాష్‌నగర్ సీఐ బాచీలాల్, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

ఫెర్టిలిటీ సెంటర్‌లో నగదు కాజేసిన దొంగ అరెస్టు

రూ.2,64,000 స్వాధీనం

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం దానవాయిపేట లక్ష్మి ఫెర్టిలిటీ సెంటర్‌లో గత నెల 28న రాత్రి ఓ దొంగ ప్రవేశించి నగదు అపహరించుకుపోయాడు. ఈ మేరకు ఆ సెంటర్ నిర్వాహకుడు గవర సాయిరామకృష్ణ గత నెల 29న స్థానిక 1 టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన 1 టౌన్ సీఐ ఎస్.మురళీకృష్ణ, ఎస్ఐ ఆదినారాయణ తమ సిబ్బందితో దొంగతనం కేసును ఛేదించారు. దొంగతనానికి పాల్పడింది స్థానిక వంకాయలవారి వీధికి చెందిన అక్కుబత్తుల గోవిందరాజు అలియాస్ గోవిందును బుధవారం అరెస్టు చేసి అతడి నుంచి రూ.2,64,000 నగదు స్వాధీనపరుచుకున్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. దొంగను పట్టుకునేందుకు కృషి చేసిన సీఐ, ఎస్ఐ, హెచ్‌సీ సురేష్, కానిస్టేబుల్ గణేష్, వెంకటేష్‌ను ఎస్పీ నరసింహ కిషోర్, డీఎస్పీ రమేష్‌బాబు అభినందించారు.

రేబీస్ సోకిన ఎద్దు మృతి


మృతిచెందిన ఎద్దు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు గ్రామంలో వీధుల్లో తిరుగుతూ పలువురిపై దాడి చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఎద్దు బుధవారం మృతి చెందింది. వివరాల ప్రకారం.. సాధారణంగా దివాన్‌చెరువులో పశువులు యథేచ్ఛగా వీధుల్లో సంచరిస్తూ ఉంటాయి. మంగళవారం ఒక ఎద్దు వింతగా ప్రవరిస్తూ కొంతమందిపై దాడి చేయడంతో ప్రజలు భయాందోళన చెందారు. ఎట్టకేలకు మంగళవారం రాత్రి గ్రామంలో దీనిని ఒకచోట కట్టేశారు. బుధవారం ఈ ఎద్దుకు మత్తు మందు ఇచ్చి దానిని అక్కడి నుంచి తరలించేందుకు పంచాయతీ అధికారులు ప్రయత్నించారు. సీతానగరం నుంచి మత్తు వైద్యులను రప్పించామని దివాన్‌చెరువు పంచాయతీ పశుసంవర్ధక శాఖసహాయకుడు గణేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆ ఎద్దు మృతి చెందిందన్నారు. ఏదైనా పిచ్చి కుక్క కరిస్తే పశువులు మతిస్థిమితం తప్పుతాయని, ఆ తర్వాత 7 నుంచి 14 రోజుల్లో మృతి చెందుతాయన్నారు. ఈ ఎద్దు కూడా రేబీస్ వ్యాధి సోకి మృతి చెందిందని, దీని యజమానులు ఎవరో తెలియలేదన్నారు.

సారా కేసులో మహిళకు రూ.50వేలు జరిమానా

పిఠాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో సారా విక్రయిస్తూ పట్టుబడిన గుత్తుర్తి మునలమ్మను బుధవారం అరెస్టు చేశారు. ఆమెను పిఠాపురం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా రూ.50వేలు జరిమానా విధించినట్టు ఎక్సైజ్ సీఐ శివరామరాజు తెలిపారు. మునలమ్మ నుంచి జరిమానా వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేశామన్నారు.

చందువ చేపల విత్తనోత్పత్తిపై సీఎంఎఫ్ఆర్ఐతో ఎంవోయూ


ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న సీఎంఎఫ్ఆర్ఐ సైంటిస్ట్‌లు, హేచరీ యాజమాన్యం

తొండంగి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చందువ చేపల విత్తనోత్పత్తిపై సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌తో కాకినాడ జిల్లా తొండంగిలోని దానవాయిపేట వైభవ్ హేచరీస్ వ్యాపార ఒప్పందం చేసుకున్నారు. బుధవారం దానవాయిపేటలో జరిగిన కార్యక్రమంలో సీఎంఎఫ్ఆర్ఐ సీనియర్ సైంటిస్ట్ జోకే జోకేకిజహకుడన్, వైభవ్ హేచరీ మేనేజింగ్ డైరెక్టర్ బేటే చంద్రశేఖర్ బేటే సాయి కపిల్ విఖ్యాత్‌లు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. దేశంలోనే మొదటిసారిగా తీరప్రాంత గ్రామాల్లో చందువ చేపల విత్తనోత్పత్తిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్పత్తి చేసేందుకు ఎంవోయూలు కుదుర్చుకుంటున్నట్టు కిజహకూడన్ తెలిపారు. రొయ్య ఉత్తత్తితోపాటు ఇతర చేపల ఉత్పత్తిని పెంచేందుకు కేంద్రప్రభుత్వం ఇచ్చిన సూచనల ఆధారంగా వాణిజ్య పరంగా చందువా చేపల ఉత్పత్తిని చేపట్టేందుకు సీఎంఎఫ్ఆర్ఐ కృషి చేసిందన్నారు. వైరస్ బ్యాక్టీరియాను తట్టుకునే విధంగా చందువా పిల్లల్ని ఉత్పత్తి చేసి పలు ప్రాంతాల్లో వీటి పెంపకంపై పరిశోధనలు చేయగా పూర్తిగా విజయవంతంపై ఆధారంగా తొండంగి మండలంలో వైభవ్ హేచరీతో ఎంవోయూ కుదుర్చుకుని రైతులకు సీడ్ అందుబాటులో ఉంచామన్నారు. రొయ్యల రైతులు కూడా వీటిని సాగుచేసి అధిక లాభాలు పొందవచ్చన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతుల సందేహాలకు సమాధానాలిచ్చారు. డాక్టర్ బిజిజెవియర్, డాక్టర్ జయశ్రీలోక, డాక్టర్ రీతేష్ రంజన్ డాక్టర్ శేఖర్ మహర్జన్ బేటే సాయి త్రిలోక్, టీడీపీ జిల్లా మత్స్యకారఅధ్యక్షుడు కోడ వెంకటరమణ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ కేసులో రీపోస్టుమార్టానికి ఎన్‌వోసీ ఇవ్వండి

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు మాజీ ఎంపీ హర్ష తనయుడు శ్రీరాజ్ వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న శ్రీరాజ్

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం రేకెత్తించిన పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి ఘటనకు సంబంధించిన కేసులో పాస్టర్ పార్థివదేహానికి ఉస్మానియా వైద్యులతో ప్రైవేటు ఫోరెన్సిక్ ల్యాబరేటరీ పర్యవేక్షణలో రీపోస్టుమార్టం నిర్వహించేందుకు ఎన్‌వోసీ ఇవ్వాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీహర్షకుమార్ తరుపున ఆయన తనయుడు జీవీ శ్రీరాజ్ బుధవారం తూర్పుగోదావరి జిల్లా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని కలిసి వినతిపత్రం అందచేశారు. ప్రపంచవ్యాప్తంగా ఈ కేసుపై తెలుగువారిలో ఆసక్తి ఉందని, ఫెయిర్ అండ్ ట్రాన్సపరెంట్ ఇన్విస్టిగేషన్ జరిగి నిజాన్ని నిగ్గుతేల్చకపోతే రానున్నకాలంలో ఇటువంటి బాధాకరమైన సంఘటనలు ఎన్నో జరుగుతాయని తెలిపారు. ఎన్‌వోసీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు


మహిళ కాలు నుజ్జు నుజ్జు అయిన దృశ్యం

నల్లజర్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల-పోతవరం రోడ్డులో ఉన్న ఫ్లైఓవర్ క్రింద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు పట్టణం తంగెళ్ళమూడికి చెందిన బత్తుల రమణమ్మ కాలు లారీ చక్రాల క్రింద పడి నుజ్జు నుజ్జు అయ్యింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమణమ్మ తమ కుమార్తె మహాలక్ష్మి స్కూటీపై తంగెళ్ళమూడి నుంచి పసివేదల వెళ్తుండగా నల్లజర్ల ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి పోతవరం నుంచి నల్లజర్ల వైపుకు వచ్చే లారీ వేగంగా వచ్చి వారి స్కూటీని బలంగా ఢీకొంది. మహాలక్ష్మి రోడ్డు వైపుకు పడిపోగా రమణమ్మ ఎడమ కాలు లారీ చక్రల కిందకు పడింది. దీంతొ నుజ్జునుజ్జు అయింది. 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రాంబాబు తెలిపారు.

మహిళ మాయలో పడిన సహకార ఉద్యోగి..

చికిత్స పొందుతూ మృతి

మహిళతో పాటు సహకరించిన ఇద్దరిపై హత్య కేసు నమోదు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలో పీఏసీఎస్ సీఈవోగా పనిచేస్తున్న 60ఏళ్ల సత్తి వెంకటేశ్వరరావుకు ఓ మాయలేడి శారీరక వాంఛ ఎరవేసి మద్యంలో మత్తుబిల్లలు, గడ్డి మందు కలిపి తాగించిన ఘటనలో కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతిచెందినట్టు అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. కాకినాడ మండల తూరంగి ప్రాంతానికి చెందిన కుమారి (30), ఆమెకు సహకరించిన బండారులంక ఎగ్జిబిషన్ వీధికి చెందిన పి.వెంకటరమణ, ఇందుపల్లికి చెందిన తుక్కు సుబ్రహ్మణ్యంపై తొలుత పట్టణ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సహకార ఉద్యోగి చికిత్స పొందుతూ మృతిచెందడంతో హత్య కేసుగా నమోదు చేసినట్టు తెలిపారు. సహకార ఉద్యోగి మృతదేహానికి గురువారం కాకినాడ జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహిస్తారన్నారు. ఈ కేసులో నిందితులు ముగ్గురిని ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్లాంట్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ...


జారి పడి కార్మికుడు మృతి


మృతిచెందిన నాగబాబు

పెద్దాపురం, సామరకోట ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్లాంట్ నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ జారి పడి ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం ఏడీబీ రహదారిలో ఉన్న రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంట్ (ఫేజ్-2)లో బుధవారం జరిగింది. వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలేనికి చెందిన రంగనాథం నాగబాబు (40) స్థానిక రిలయన్స్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పరిశ్రమలో ప్లాంట్ నిర్మాణ పనులు జరిగే సమయంలో అదుపుతప్పి పైనుంచి పడి తీవ్రంగా గాయాలపాలయ్యాడు. యాజమాన్యం స్థానిక ప్రభుతాసుపత్రికి తరలించింది. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పెద్దాపురం ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

తుని రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పల్సర్ ద్విచక్రవాహనంపై ఆగి ఉన్న వ్యక్తిని బొలోరా వ్యాన్ ఢీ కొనడంతో మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తునిలో జరిగింది. పాయకరావుపేట మండలం నామవరం గ్రామానికి చెందిన చందక శివ(19) తునిలో ఓ ప్రైవేట్ ఇంటర్నెట్ సంస్థలో పనిచేస్తున్నాడు. అయితే విధుల్లో భాగంగా బుధవారం ఎస్.అన్నవరం వైపు వెళ్తూ రోడ్డుపై ద్విచక్రవాహనంపై ఆగి ఉండగా అతివేగంగా వచ్చి వ్యాన్ ఢీకొందని స్థానికులు తెలిపారు. శివ అక్కడికక్కడే మృతిచెందగా సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసినట్టు సీఐ గీతా రామకృష్ణ తెలపారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

'డైట్'ల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)ల్లో డిప్యూటేషన్ పద్ధతిలో అధ్యాపక ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్టు కాకినాడ జిల్లా డీఈవో పిల్లి రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి అర్హులైన పాఠశాల సహాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోల నుంచి కోరుతున్నామన్నారు. అర్హత గల సంబంధిత సబ్జెక్టులలో 55శాతం మార్కులు, ఎంఈడీలో 55 శాతం మార్కులు కలిగి స్కూల్ అసిస్టెంట్‌గా కనీసం ఐదేళ్లు అనుభవం కలిగి వారి వయసు 58 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 10వ తేదీలోపు కాకినాడ డీఈవో కార్యాలయంలో సమర్పించాలని రాత పరీక్ష, ఇంట ర్వ్యూ ద్వారా ఈ ఖాళీలను పూరిస్తామన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు https:// forms.gle/4unKU4g6moktyp5Q6 లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి హార్డ్ కాపీ ని సంబంధిత అధికారుల ద్వారా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రజల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత బీజేపీ ప్రజా ప్రతినిధులు తీసుకుంటారని ఆ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అసెంబ్లీలో కూటమి బలంగా ఉన్నా మండలిలో వైసీపీ మెజార్టీ వల్ల కొన్ని ఆటంకాలు ఎదురవుతున్నాయన్నారు. తాజాగా టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి ఐదుగురు సభ్యులు మండలిలో కూటమి ప్రభుత్వం తరపున చేరడంతో బలం పెరిగిందన్నారు. సోము వీర్రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు త్రికరణ శుద్ధితో ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పల్లెల్లో కుళాయిలు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వంలో జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కుళాయి నీరిస్తూ పవన్ కల్యాణ్ పేదల దాహార్తి తీరుస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్సీగా తనను ఎంపిక చేసిన బీజేపీ అధిష్టానం, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు వీర్రాజు కృతజ్ఞతలు తెలిపారు.

పంగిడిలో 'తిరుమల' నూతన శాఖ ప్రారంభం


పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తిరుమలరావు

కొవ్వూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల విద్యాసంస్థల నూతన శాఖను కొవ్వూరు మండలం పంగిడిలో ప్రారంభించారు. బుధవారం నూతన శాఖలో చైర్మన్ నున్న తిరుమలరావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిగా తిరుమల విద్యాసంస్థలను రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో స్థాపించామని.. అనంతరం విశాఖపట్నం, భీమవరం, పాయకరావుపేట, తణుకులో ప్రారంభించడం జరిగిందన్నారు. కొవ్వూరు మండలం పంగిడిలో నూతన శాఖను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విలువలతో కూడిన విద్యను అందరికి అందించాలనే సదుద్దేశంతో తిరుమల విద్యాసంస్థలను స్థాపించామన్నారు. కొవ్వూరు, దేవరపల్లి, చాగల్లుల్లోని పూర్వ విద్యార్థులు, తల్లితండ్రులు, శ్రేయోభిలాషుల కోరికమేరకు పంగిడి, కాపవరం జంక్షన్ వద్ద తిరుమల నూతన శాఖను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ క్యాంపస్‌లో ఎల్.కె.జీ నుంచి పదో తరగతి, జూనియర్ ఇంటర్ డేస్కాలర్‌గా ప్రారంభించామన్నారు. కొవ్వూరు, చాగల్లు, దేవరపల్లి, నిడదవోలు, గోపాలపురం, కొయ్యలగూడెం చుట్టుపక్కల గల అన్ని ప్రాంతాల నుంచి బస్సుసౌకర్యం కలదన్నారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈ అవకాశాన్ని తల్లితండ్రులు వినియోగించుకోవాలన్నారు. అడ్మిషన్ల కోసం 8096397777, 8096497777లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి కెఎస్ జవహర్, డా.సాంబశివరావు, తిరుమల డైరెక్టర్ నున్న సరోజినీదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ యు.శ్రీహరి, చాగల్లు, పంగిడి, కొవ్వూరు ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు, తల్లితండ్రులు, తిరుమల సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్సీగా పేరాబత్తుల ప్రమాణ స్వీకారం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖరం ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు తన కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలతో ప్రమాణ స్వీకారం చేయించారు.

హత్య కేసులో తండ్రీకొడుకుల అరెస్ట్

తప్పు ఒప్పుకున్న నిందితులు

నల్లజర్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో గత నెల 31న సోమవారం రాత్రి పేరం శివ (27)ను కత్తులతో దారుణ హత్య చేసిన అతడి బావమరది రేగుల శ్రీరామ్, మామ వెంకన్నలను బుధవారం అరెస్ట్ చేసినట్టు సీఐ రాంబాబు తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే తమ కుతూరుని శివ తిట్టడం, కొట్టడం జరుగుతుందని కోపంతో శివను హత్య చేసినట్టు నిందితులు పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు నేటి నుంచి ఉచిత శిక్షణ

పిఠాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం బైపా్‌స్‌లోని పాదగయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు గురువారం నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ అక్కుల మురళి బుధవారం తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు శిక్షణ ఇస్తారన్నారు. హాజరయ్యే వారికి మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. కాగా పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15 వరకు అవకాశం ఉందన్నారు. పిఠాపురంలో తొలిసారిగా పరీక్ష కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఈ నెల 30న పట్టణంలోని పది కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపాల్ చెప్పారు.



అగ్నిప్రమాదాల నివారణపై జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ రాహుల్‌మీనా, ఏఎస్పీ పాటిల్

'రెవెన్యూ అంశాలను సకాలంలో పరిష్కరించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్షించారు. ప్రజా పరిష్కార వ్యవస్థలో ఎక్కువ శాతం భూ సంబంధిత అంశాలపైనే వినతులు అందుతున్నాయన్నారు. ఈ సమస్యల పరిష్కారాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షిస్తున్నందున రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వేలోని సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న గ్రామసభలను ప్రతి మండలంలోను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. మండల స్థాయిలో రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేసి అర్జీదారుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. రెవెన్యూ కార్యాలయాల్లో రికార్డులు భద్రపరిచే గదుల ఆధునికీకరణకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలన్నారు. డీఆర్వో వెంకట్రావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, కేఆర్ఆర్సీ ఎస్డీసీ రత్నామణి, సర్వే శాఖ ఏడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలను నివారించాలి

ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, కేరళ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఇటీవల అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఆయా రాష్ట్రాల్లోని జిల్లాల కలెక్టర్లతో న్యూఢిల్లీ నుంచి నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ హెచ్‌వోడీలు, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అగ్నిప్రమాదాలను నివారించాలని సూచించారు. కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షాన్‌మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, ఏఎస్పీ మనీష్‌పాటిల్ దేవరాజ్, అదనపు ఎస్పీ భాస్కరరావు, జిల్లా అగ్నిమాపక అధికారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న లోకేశ్ ఫౌండేషన్ సభ్యులు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ పుట్టినరోజు సందర్భంగా నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పెద్ద మార్కెట్ ఏరియాలో వంద మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో బాటసారులకు చెరకు రసం పంపిణీ చేశారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరామ్‌వర్మ, నగర అధ్యక్షుడు బత్తుల సూర్యప్రసాద్ టీడీపీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి పంచారు. అన్న ఎన్టీఆర్ జనార్దన్ క్యారేజీ ద్వారా పేదలకు భోజనం పెట్టారు. కార్యక్రమంలో ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఫణీంద్ర, ప్రతినిధులు కాలసాని లక్ష్మణ్, పల్లపోతు వెంగళరావు, మండ పాక నాగబాబు, అడపా జగదీష్, గూడ్స్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రమణ, కర్రి వీరబాబు, పాలిక ప్రసాద్, ఫిరోజ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

5న పిఠాపురంలో రెల్లి కులాల మహా పాదయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న రెల్లి సంఘాల ప్రతినిధులు

పిఠాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న రెల్లి కులాలకు ఎస్సీ వర్గీకరణలో ఒక శాతమే రిజర్వేషన్ కల్పించడాన్ని నిరసిస్తూ పట్టణంలో ఈ నెల 5వ తేదీన మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు రెల్లి సంఘాల ప్రతినిధులు తెలిపారు. పిఠాపురంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రెల్లి కులస్తుల జనాభా 2011 కంటే గణనీయంగా పెరిగిందన్నారు. రెల్లి, దాని ఉపకులాలు 12 వరకు ఉన్నాయని, ఇప్పుడు బేడ, బుడగ జంగం కులాన్ని ఇందులో చేర్చడం బాధాకరమని చెప్పారు. దళితుల్లోనే రెల్లి కులస్తులు అత్యంత దయనీయ స్థితిలో ఉన్నారని జస్టిస్ రామచంద్ర కమిషన్ తన నివేదికలో తెలిపిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రెల్లి కులాలను ప్రత్యేక కేటగిరీగా గుర్తించి రెండు శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బేడ, బుడగ జంగాలను వేరే గ్రూపులో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో న్యాయవాది, రెల్లి సంఘం రాష్ట్ర నాయకుడు బంగారు రామకృష్ణ, కన్వీనర్ యర్రంశెట్టి శ్రీనివాస్, అల్లం కిషోర్, ఆకుల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.






నాగబాబు, రాజశేఖర్‌లకు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

నూతన ఎమ్మెల్సీలకు ఎమ్మెల్యే రాజప్ప అభినందన

సామర్లకోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా బుధవారం ప్రమాణం చేసిన పేరాబత్తుల రాజశేఖర్‌ను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అభినందించారు. జనసేన తరపున ఎమ్మెల్సీగా ఎన్నికైన కొణిదెల నాగబాబును కూడా ఆయన మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.



కొమ్మకొమ్మకు విరగకాసిన ఉసిరికాయ గుత్తులు

కొత్తపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకతిప్పకు చెందిన జ్యోతుల సత్యనారాయణ ఇంటి పెరట్లో ఉసిరి చెట్టుకు కాయలు విరగకాసాయి. చెట్టుకున్న ప్రతి కొమ్మకు కాయలు గుత్తులు, గుత్తులుగా కాయడంతో గ్రామస్తులు ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు. ఉసిరికాయలను కోసి చుట్టుపక్కల వారికి, స్కూలుకెళ్లే విద్యార్థులకు పంచుతున్నామని తెలిపారు.

పెండింగ్ బకాయిలను తక్షణం చెల్లించాలి: ఫ్యాప్టో



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఫ్యాప్టో సభ్యులు, ఉపాధ్యాయులు

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను తక్షణం చెల్లించాలని, సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఫ్యాప్టో (ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కాకినాడ కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో ప్రతినిధులు మాట్లాడుతూ 12వ వేతన సవరణ కమిషన్ నియమించాలని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత నాలుగు సంవత్సరాలుగా పీఎఫ్, ఏపీ జీవిత బీమా పథకం లావాదేవీలు నిలుపుదల చేయడంతో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డీఏకు అనుసంధానంగా ఇవ్వాల్సిన ఐదు డీఏలను ఇవ్వాలన్నారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. 11వ పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవు బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం కలెక్టర్ షాన్ మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఫ్యాప్టో చైర్మన్ కాశీవిశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి సూరిబాబు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవిచక్రవర్తి, ఇతర ప్రతినిధులు కూర్మారావు, వెంకట్రావు, రవి, సీతారామయ్య పాల్గొన్నారు.

దేవాలయాల ఆస్తుల సంరక్షణకు చర్యలు

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ



సర్పవరంలో భావనారాయణస్వామికి చెందిన ఖాళీ భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ, దేవదాయ శాఖ డీసీ రమేష్‌బాబు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల ఆస్తుల సంరక్షణకు ఖాళీగా ఉన్న భూములు, స్థలాలకు వేలం వేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. బుధవారం ఆయన భావనారాయణస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవదాయ శాఖ ఉప కమిషనరు రమేష్ బాబు, ఈవో ఎం.లక్ష్మీనారాయణలతో కలిసి మెయిన్‌రోడ్డులో గోశాలకు చేర్చి భావనారాయణస్వామికి చెంది ఖాళీగా ఉన్న సుమారు 1.79 ఎకరాల భూమి, భావనగర్ ఎస్టేట్ ఎదురుగా గల సుమారు 18 ఎకరాల ఖాళీ భూమిని పరిశీలించారు. ఖరీదైన భూముల సంరక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. భావనారాయణస్వామి ఖ్యాతిని ప్రపంచం నలుదిశలా వ్యాపించేలా టెంపుల్ టూరిజంలోకి అనుసంధానం చేసేందుకు మంత్రి కందుల దుర్గేష్ కృషి చేస్తున్నారన్నారు. గోశాల పక్కన ఉన్న 1.79 ఎకరాల ఖాళీ స్థలానికి 11 ఏళ్లకు వేలంపాట నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఉప కమిషనరు రమేష్‌బాబు తెలిపారు. అందులో వున్న చెత్త, పిచ్చిమొక్కలను తొలగించి వేలం నిర్వహణకు చర్యలు చేపట్టాలని ఈవోను ఆదేశించారు. ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, గ్రామ కార్యదర్శి పబ్బినీడి శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు, ముద్దన ప్రకాష్, పుల్ల వీరబాబు, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, ఎర్రంశెట్టి నీలవేణి, కొల్లి సంధ్య తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

'కిట్స్'లో ప్రాంగణ ఎంపికలు

పెద్దాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉత్తరప్రదేశ్‌కి చెందిన విండ్ కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వర్చువల్‌గా ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఎస్.మణికంఠ, ఎస్.సాయిసుభమ్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిని కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ప్రారంభోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

గొల్లప్రోలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో ఎమ్మెల్సీ నాగబాబు, ప్రభుత్వ విప్ హరిప్రసాద్ ప్రారంభించనున్న అభివృద్ధి పనుల వద్ద ఏర్పాట్లపై అధికారులు పరిశీలన జరిపారు. అర్బన్ హెల్త్ సెంటర్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ పరిశీలించారు. ఏర్పాట్లపై అడిషనల్ డీఎంహెచ్‌వో సుబ్బరాజు, డీపీఎంవో లక్ష్మిలకు సూచనలు ఇచ్చారు. గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయ నూతన భవనం, అన్న క్యాంటీన్, వాటర్‌వర్క్స్‌లను పాడా ఏపీడీ వసంతమాధవి, కమిషనరు కనకారావు, శ్రీనివాస్ తదితరులు పరిశీలించారు.

నాడీ వ్యవస్థ వైఫల్యంతో ఆటిజం

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నాడీ వ్యవస్థలో ఏర్పడిన లోపంతో ఆటిజం బారిన పడతారని, ఇది వెయ్యి మందిలో ముగ్గురు, నలుగురికి సంభవిస్తుందని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్టు అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. ప్రసాద్‌నాయుడు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన

పెద్దాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఆటిజం బారినపడిన పిల్లలతో ప్రధానోపాధ్యాయురాలు ఎంఎల్ శివజ్యోతి కేక్ కట్ చేయించారు. భవిత కేంద్రం ఉపాధ్యాయుడు బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు ఆటిజం అనుమానిత లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్లు సంప్రదించాలని ఫిజియోథెరపిస్టు డాక్టర్ సోమేశ్వరరావు అన్నారు. బుధవారం కోటనందూరులో నాన్ భవిత కేంద్రం వద్ద ప్రపంచ ఆటిజంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆటిజం ఉన్న పిల్లలకు మందులు వాడటం, కౌన్సిలింగ్ ద్వారా మానసిక పరిపక్వతను పెంచవచ్చన్నారు.

సీనియర్ ఫ్యాకల్టీలుగా ఇద్దరు ఎంపీడీవోలు

సామర్లకోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు ఎంపీడీవో సుశీల, కాకినాడ జిల్లా శంఖవరం ఎంపీడీవో ఎస్ఎస్ శర్మలను సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. బుధవారం వారు ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సీనియర్ ఫ్యాకల్టీలుగా బాధ్యతలు చేపట్టారు.

ఆంధ్ర పాలిటెక్నిక్‌లో పరిపాలనా భవనం ప్రారంభం



పరిపాలనా భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలోని ఆంధ్ర పాలిటెక్నిక్‌లో ఆర్ఐడీఎఫ్ నిధులు రూ.4 కోట్లతో నిర్మించిన పరిపాలనా భవనాన్ని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ బుధవారం ప్రారంభించారు. శిథిలస్థితికి చేరిన బ్లాక్‌ల స్థానంలో త్వరలో నూతన భవనాల నిర్మాణానికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో సాంకేతిక విద్య డైరెక్టర్ పద్మారావు, ప్రిన్సిపాల్ నల్లి జనార్దనరావు, ప్రాంతీయ సంచాలకుడు జె.సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంటుకు శ్రీకారం

సామర్లకోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఏడీబీ రోడ్డు సమీపంలో రూ.350 కోట్ల వ్యయంతో రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంటు నిర్మాణానికి మంత్రి నారా లోకేశ్, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ కుమారుడు బుధవారం వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు. రోజుకు 22.5 మెట్రిక్ టన్నుల మేర బయో గ్యాస్ ఉత్పత్తి కాగలదని జీపీఎస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ తెలిపారు. తొలి విడతలో కాకినాడ-1 ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభిస్తామని, కాకినాడ-2, కాకి నాడ-3 ప్లాంట్‌లను జూన్, డిసెంబరు నెలల నాటికి ప్రారంభిస్తామన్నారు. రిలయన్స్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే బయో గ్యాస్‌ను వంటగ్యాస్ గాను, గ్యాస్ ఆధారంగా నడిచే అన్ని రకాల వాహనాలకు వినియోగించుకోవచ్చని వంశీకృష్ణ చెప్పారు.

'పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు'

పిఠాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పన్నుల వసూళ్లల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని పిఠాపురం మునిసిపల్ కమిషనరు కనకారావు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఆయన సచివాలయ, మునిసిపల్ సిబ్బంది, వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. బకాయిలు ఉన్నవారిని గుర్తించి వారి వద్ద నుంచి పన్నులు వసూలు చేయాలని, ఈ నెలాఖరులోగా పన్నులు చెల్లించే వారికి ఉన్న రాయితీ గురించి వివరించాలని సూచించారు. పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అనధికారిక కట్టడాలు, నాన్ లే-అవుట్లలో నిర్మాణాలను ఎందుకు ఉపేక్షిస్తున్నారని ప్రశ్నించారు. ఇక నుంచి వారి పరిధిలో జరిగే అన్ని నిర్మాణాలపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. పన్నులు విధించని గృహాలను గుర్తించి పన్నులు విధించాలని తెలిపారు. సమావేశంలో మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.



మహిళల నుంచి వినతులు స్వీకరిస్తున్న టీడీపీ నేతలు

పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించలేదు

'కార్యకర్తే అధినేత' కార్యక్రమంలో మహిళల ఆవేదన

పిఠాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం 'కార్యకర్తే అధినేత' కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టాలు ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం స్థలాలు చూపించకుండా తమను మోసగించిందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని చూపించాలని వినతిపత్రం అందించారు. ఆర్థిక సహాయం కోరుతూ పలువురు కార్యకర్తలు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 25 వినతులు రాగా వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపుతున్నట్టు నాయకులు తెలిపారు. ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, టీడీపీ నాయకులు సకుమళ్ల గంగాధర్, కొరుప్రోలు శ్రీను, బర్ల అప్పారావు, మడికి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా యానిమేటర్‌పై పోలీసులకు ఫిర్యాదు

కొత్తపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజోతి): బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించి తమకు చెల్లించకుండా కాజేసిన యానిమేటర్‌పై చర్యలు చేపట్టాలని ఉప్పాడకు చెందిన డ్వాక్రా గ్రూపు సభ్యులు బుధవారం కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉప్పాడ శివారు కొత్తపట్నానికి చెందిన ఎం.ఆదిలక్ష్మి యానిమేటర్‌గా పనిచేస్తున్న సమయంలో తమ సొమ్ము రూ.12లక్షలు కాజేసిందని, పెద్దల సమక్షంలో తగువుపెట్టిన తర్వాత రూ.8లక్షలు చెల్లించి, మిగిలిన సొమ్ము ఇవ్వడానికి ఎదురు తిరిగిందన్నారు. చేపట్టి తమకు రావాల్సిన సొమ్మును ఇప్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆదిలక్ష్మిని విచారించి తగు చర్యలు చేపడతామని ఎస్ఐ వెంకటేష్ చెప్పారు.



అమ్మవారిపై ప్రసరించిన సూర్య కిరణాలు

అపర్ణాదేవికి అరుణకిరణ స్పర్శ

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో కొలువైన అపర్ణాదేవిపై బుధవారం సూర్య కిరణాలు ప్రసరించాయి. అమ్మవారిని భక్తులు దర్శించుకుని తన్మయత్వానికి లోనయ్యారు. వేద పండితుడు ఆకొండి వెంకటేశ్వర శర్మ, ప్రధానార్చకుడు అర్చకుడు ప్రభాకర శాస్త్రి పూజలు జరిపారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జిగా కాకినాడ జేసీ

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జిగా కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వరప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, జిల్లా కేంద్ర కేంద్ర గ్రంథాలయ ఉప అధికారులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఈనెల 6న జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా కాకినాడ డిపో నుంచి ఈ నెల 5వ తేదీ నుంచి స్పెషల్ బస్సులు నడపనున్నట్టు మేనేజర్ మనోహర్ తెలిపారు. ప్రతిరోజూ నడిచే ఏడు బస్సులకు అదనంగా పది స్పెషల్ బస్సులు నడుపుతామన్నారు. రాను, పోను ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం ఉందని చెప్పారు.

నేడు, రేపు మంచినీటి సరఫరాకు అంతరాయం

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట నుంచి శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు సరఫరా అవుతున్న రా వాటర్ 1500 ఎంఎం మెయిన్ లైన్ లీకవుతున్న కారణంగా రిపేర్ల నిమిత్తం గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇంజనీరింగ్ సెక్షన్ ఎస్ఈ తెలిపారు. శ్రీవిద్య కాలనీ(డీ మార్ట్), దుమ్ములపేట, శ్రీనివాసబ్యాంక్ కాలనీ (గ్రిగోగులపాడు), 4,6,7,8,9,10,11,12,13, 49, 50 వార్డుల పరిధిలోని ప్రజలు మంచినీటిని ముందుగా నిల్వ చేసుకోవాలన్నారు. అత్యవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామన్నారు. 984871415, 6301387834, 9676770461, 7382042977 నెంబర్లను సంప్రదించాలన్నారు.

కొనసాగిన చేపల పట్టివేత

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తిలోని పెదచెరువులో రెండోరోజైన బుధవారం పోలీసు బందోబస్తు మధ్య అధికారుల పర్యవేక్షణలో చేపల పట్టివేత, విక్రయాలు జరిగాయి. మత్స్య, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు విక్రయాలను పర్యవేక్షించారు.



అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్‌తో నిఘా

గొల్లప్రోలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని డ్రోన్ సహాయంతో గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పిఠాపురం సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. గొల్లప్రోలులోని రాయవరం సెంటరుతో పాటు పలు ప్రధాన కూడళ్లల్లో బుధవారం సాయంత్రం డ్రోన్ ద్వారా పరిశీలన జరిపారు. బహిరంగంగా మద్యం, గంజాయి తాగినా, మత్తు పదార్థాలు వినియోగించినా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'స్మార్ట్ మీటర్లు మా ఇంటికి వద్దు'

పెద్దాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అదానీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇళ్లకు వేస్తున్న స్మార్ట్ మీటర్లు మాకొద్దు అంటూ సీపీఎం రూపొందించిన గోడ పత్రికను సీపీఎం నాయకులు యాసలపు సూర్యారావు భవనంలో బుధవారం ఆవిష్కరించారు. ఆ పార్టీ మండల కార్యదర్శి దారపు రెడ్డి క్రాంతికుమార్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజానీకం అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణసత్యనారాయణ, రొంగల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : సీఐ

గండేపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ హెచ్చరించారు.ఉప్పలపాడు గ్రామంలో రిప్‌రాప్‌గా, ఐహ్యాండెడ్‌గా తిరుగుతున్న తొమ్మిది మందిని గుర్తించి వారిని సర్కిల్ కార్యాలయానికి రప్పించి సీఐ శ్రీనివాస్ కౌన్సిలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తన కోసం వారిని బైండోవర్ చేయడం జరిగిందని సీఐ తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

రంపచోడవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మన్యంలో అన్ని రకాల ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. బుధవారం రంపచోడవరం ఎంపీడీవో కార్యాలయంలో ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. రంపచోడవరం, ఎటపాక డివిజన్ల నుంచి వచ్చిన ప్రజలు అనేక వినతులను సమర్పిం చారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు కారం సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంతమోహన్, అడబాల బాపిరాజు, కారం సింహాచలం, సిద్దా వెంకన్న, ప్రసాద్, వై. నిరంజనీదేవి పాల్గొన్నారు.

అక్కసుతో ఆపేశారు

• వైసీపీ తీరుతో సొంతింటి కలకు దూరమైన ఆదివాసీలు
• రూ.1,94,23,876 వేల పెండింగ్ బిల్లులు • మొత్తంగా నిలిచిన 416 కాలనీలు


మోతుగూడెంలో నిలిచిపోయిన ఆదివాసీలకు కేటాయించిన ఎన్టీఆర్ రూరల్ కాలనీలు

చింతూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మన్యంలో ప్రతి గిరిజనుడికీ సొంతిల్లు కట్టించాలన్న దృక్పథంతో టీడీపీ ప్రభుత్వం 2016-17లో ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ పేరిట కాలనీలు మంజూరు చేసింది. అదేదశలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పేరిట కేంద్ర ప్రభుత్వ పథకంలో బాగంగా కూడా మరికొన్ని కాలనీలు మం జూరు చేయించడం జరిగింది. కాగా అవన్నీ పూర్తి చేస్తే ఆ క్రెడిట్ అంతా టీడీపీ కే దక్కుతుందన్న అక్కసుతో వైసీపీ అధికారం లోకి వచ్చాక వాటిన్నిటికీ బిల్లులు మంజూరు చేయడం నిలిపేసింది. దీంతో ఆయా కాలనీలన్నీ అర్థాంతరంగా నిలిచిపోయాయి. అవి నేడు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. చివరకు ఆదివాసీల సొంతింటి కల నెరవేరకుండా పోయింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజను పరిధిలో 601 మంది లబ్ధిదారులకు చెందిన కాలనీలు వివిధ దశల్లో ఆగిపోయాయి. ఇవన్నీ ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకాల్లో మంజూ రైనవే. వీటన్నిటికీ రూ.1.94, 23,876 పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఏళ్లు గడుస్తున్నప్పటికీ బిల్లులు చెల్లింపు జరగక పోవడంతో అవన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనేన్న చందంగా ఉండిపోయాయి. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పేరిట 2016- 18 కాలంలో మంజూరు చేసినవి చింతూరు మండలంలో 83, కూనవరంలో 52, వరరామచంద్ర పురంలో 12, ఎటపాకలో 38 కాలనీలకు రూ.60,18,842 పెండింగు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అదేదశలో ఎన్టీఆర్ రూరల్ 2016-17 పథకంలో బాగంగా చింతూరులో 134, కూనవరంలో 60, వరరామ చంద్ర పురంలో 66, ఎటపాక మండలంలో 156 కాలనీలు బిల్లులు మంజూరు చేయక పోవడంతో నిలిచి పోయాయి. దీంతో ఆయా లబ్ధిదారులు పక్కా గృహాలు లేకపోవడంతో పూరిళ్లల్లో నివాసం ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. వర్షం వచ్చినప్పుడు పలువురి ఇళ్లలోని అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక నెలరోజుల క్రితం గృహనిర్మాణ శాఖ అధికారులు పెండింగ్‌లో ఉన్న ఇళ్లన్నింటినీ రీ సర్వే చేశారు. కాగా బిల్లులు చెల్లింపుల్లో మాత్రం ఎటువంటి కదలిక లేదు.

గండిపోశమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరావు


అమ్మవారి ఫొటోను అందుకుంటున్న మాజీ ఎమ్మెల్యే

దేవీపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు బుధవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా పేరొందిన గండిపోశమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి శాలువాతో సత్కరించి అమ్మవారి ఫోటో అందించారు. కత్తుల చల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

నీటితొట్టెల నిర్మాణానికి శంకుస్థాపన


నీటితొట్టెల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బొడ్డగండి పంచాయతీ గంగవాడలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పశువులకు నీటి తొట్టెల నిర్మాణానికి ఎం పీటీసీ కరకా వెంకటరమణ, సర్పంచ్ వేమ సంధ్యా రాణితో కలిసి శంకుస్థాపన చేశారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి నిర్మించడం జరుగుతుందని, ఒకొక్క నీటి కుంట దాదాపు రూ.30 వేలు వరకు ప్రభు త్వం ఖర్చు చేస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని పశు సంపదను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగ్ జయదాస్, ఏపీవో స్వామి, కూటమి నేతలు, రైతులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణానికి శ్రీకారం

రాజవొమ్మంగి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కింద్ర పంచాయతీలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మంజూరైన పశువుల తాగునీటి తొట్టెలను బుధవారం ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీవో రెడ్డి బాబు, సర్పంచ్ బూసరి సత్యనారాయణ, టీఏ రామలక్ష్మి, వార్డు మెంబర్ బండి పార్వతి పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

అడ్డతీగల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ.నిస్సీకుమార్ ఆధ్వర్యంలో అడ్డతీగలలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ పాస్టర్ ప్రవీణ్ మృతి విషయంలో అనేక అనుమానాలున్నాయని ప్రభుత్వం పారదర్శ కంగా విచారణ చేపట్టి నిజానిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రవీణ్ అభిమానులు సమన్వయంతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సంఘ జాయింట్ కార్యదర్శి విక్టర్ ఇమ్మానుయేల్ జె.కర్యా, ఆరోగ్యరాజ్, శ్రీకాంత్, జాన్‌పాల్ తదితర పాస్టర్స్, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఈఎంటీ దినోత్సవం

రాజవొమ్మంగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జాతీయ అత్యవసర వైద్య సేవల నిపుణుల (ఈఎంటీ) దినోత్సవం సందర్భంగా బుధవారం జడ్డంగి పీహెచ్‌సీలో వైద్యాధికారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కోఆర్డినేటర్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలను నియంత్రించడానికి ప్రతీ ఒక్క ఈఎంటి కూడా కృషి చేయాలనారు. కార్యక్రమంలో రంపచోడవరం డివిజన్ పరిధిలో ఉన్న ఫీడర్ అంబులెన్స్‌ల ఈఎంటీలు పాల్గొన్నారు.

వందన్ వికాస కేంద్రాల ద్వారా జీడిపిక్కల కొనుగోలు

ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి

రంపచోడవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో జీడిపిక్కలు వందన్ వికాస కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతోందని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. బుధవారం పందిరి మామిడిలో వందన్ వికాస్ ద్వారా జీడిపిక్కల కొనుగోలు కేంద్రాన్ని ఆమెతో పాటు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ముఖ్యఅతిథులుగా హాజరై రిబ్బన్ కటింగ్ చేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దళారుల నుంచి గిరిజన రైతులు మోస పోకుండా ఏజెన్సీ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ వీడీవీకేలలో జీడిపిక్కలు అమ్ముకుని గిరిజనులు అభివృద్ధి చెందేం దుకు తోడ్పాటు అందించాలన్నారు. ఏపీడీ డేగలయ్య, డీపీఎంలు అపర్ణ, పరమేశ్వరరావు, ఏపీఎం కామేశ్వరస్వామి పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి


రంగవల్లినగర్‌లో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాలు

జగ్గంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, పీడబ్ల్యూ, పీడీఎస్‌యూ, తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జగ్గంపేట శివారు రంగవల్లినగర్‌లో ధర్నా నిర్వహించారు. ఏపీ ఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ చేపట్టి, వాస్తవాలను బయటపెట్టి ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ఏపీ ఆర్‌సీఎస్ రాష్ట్ర నాయకులు కొండ దుర్గారావు, జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు తదితరులు నాయకత్వం వహించారు.

అప్పారావు కుటుంబానికి పరామర్శ

జగ్గంపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గోవిందపురానికి చెందిన వైసీపీ నేత ఇళ్ళ అప్పారావు కాపు తమ్ముడు వరహాలు ఇటీవల జె.కొత్తూరు వద్ద ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని బుధవారం టీడీపీ నాయకులు పరామర్శించారు. వరహాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మారిశెట్టి భద్రం, టీడీపీ టౌన్ అధ్యక్షుడు రాంబాబు, వెలుబండి గంగరాజు, భూపాలపట్నం ప్రసాద్, కొండ్రోతు శ్రీను పాల్గొన్నారు.

సాధారణ కాన్పుకే ప్రాధాన్యం ఇవ్వాలి


అవగాహన కల్పిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య

ప్రత్తిపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గర్భిణులు సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య మైఖేల్ అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రికి చెందిన సీమాంక్ సెంటర్‌లో బుధవారం గర్భిణులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు కాన్పు నొప్పులు వచ్చేవరకు వేచి చూడాలని, తొందరపడి ఆపరేషన్ చేయమని వైద్యులను కోరడం మంచిది కాదని పేర్కొన్నారు.

గజ్జనపూడిలో గంగాలమ్మతల్లి సంబరాలకు సన్నాహాలు


గంగాలమ్మకు పూజలు చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గజ్జనపూడిలో గింజాల వారి గంగాలమ్మ తల్లిగాబు సంబరాలకు బుధవారం సన్నాహాలు చేపట్టారు. స్థానిక అమ్మవారి ఆలయం వద్ద అమ్మవారికి పూజలు నిర్వహించి, పసుపు దంచి, పందిరి రాట వేసే ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈనెల 10న గంగాలమ్మ తల్లిగాబు సంబరం ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా గుబ్బలమ్మ తల్లి జాతర


మురారిలో గుబ్బాలమ్మను దర్శించుకుంటున్న టీడీపీ యువ నేత జాస్తి వసంత్

గండేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మురారి గ్రామంలో గుబ్బలమ్మతల్లి జాతర మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల యువ నాయకుడు, మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్, గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతర జరిగింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. గరగలు, వేషధారణలు, బాణసంచా, తీన్మార్ డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు.

దొడ్డిపట్లకు బీజేపీ నేత చిలుకూరి పరామర్శ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం ధ్యాన మండలి అధ్యక్షుడు దొడ్డిపట్ల సోమన్నదొరను బుధవారం బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. గుండెకు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న దొడ్డిపట్లను రామ్‌కుమార్ పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఊటా వీరబాబు, నాయకుడు నానిపల్లి శ్రీనివాస్, కర్రి ధర్మరాజు, కడారిశ్రీను, రామకుర్తి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా కిట్ల పంపిణీ

కోటనందూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఫైలేరియా వ్యాధి లేకుండా కృషి చేయాలని డాక్టర్ రాజశేఖర్ అన్నారు. బుధవారం అల్లిపూడిగ్రామంలో ఫైలేరియాపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఫైలేరియా వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా ఫైలేరియా ఆధ్వర్యంలో 17 కిట్లను పంపిణీ చేశారు. అంకంరెడ్డి బుల్లిబాబు, చింతకాయల కొండబాబు, సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భాష్యం స్కూల్ ఆరో వార్షికోత్సవం


సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

జగ్గంపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట రావులమ్మనగర్ భాష్యం స్కూల్‌లో బుధవారం ఆరవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటే మానసిక ఉత్సాహం కలుగుతుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పిరిమిడ్స్ ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్‌చార్జ్ గోవిందరాజులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదవీవిరమణ పొందిన స్టాఫ్‌నర్స్ ప్రమీలకు సన్మానం


ప్రమీలను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ విశ్వేశ్వరరావు, తదితరులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సేవాదృక్పథంతో పని చేసిన స్టాఫ్ నర్సు ప్రమీల ఆదర్శనీయురాలని పలువురు కొనియాడారు. ఉద్యోగ విరమణ చేసిన ప్రత్తిపాడు ఆసుపత్రి స్టాఫ్‌నర్సు ప్రమీల దేవికి బుధవారం స్థానిక సరయు ఫంక్షన్ హాల్లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, సీబీఎన్ ఆర్మీ నియోజకవర్గ కోఆర్డినేటర్ యాళ్ళ జగదీష్, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి వెంకటరత్నం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం ఎంపీపీలు గోళ్ళ కాంతి సుధాకర్, గొల్లపల్లి బుజ్జిలు ప్రమీల దేవికి శాలువా కప్పి సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు యాళ్ల విశ్వేశ్వరరావు, మూరా వరప్రసాద్, శిరసాల రామకృష్ణ, టీడీపీ నాయకులు యర్రాబత్తుల గోవిందనాయుడు, రావూరి తాతాజీ, నెల్లిపాక నాగు, వైసీపీ నాయకులు శేరు కృష్ణ, గోళ్ళ జయశేఖర్,పాస్టర్‌మాతా ఇమ్మానియేలు, గుడాల సుందరరావు పాల్గొన్నారు.

ధర్మవరం ప్రతిభా విద్యాలయంలో వంటకాల పోటీలు


వంటకాల పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం ప్రతిభా విద్యాలయంలో బుధవారం వంటల పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో విద్యార్థుల తల్లులు పాల్గొని రకరకాల వంటకాలు చేశారు. పి.నాగలక్ష్మి, పి.చిన్నారి. పి.నాగలక్ష్మి, ఎన్.అరుణ, ఎస్.దుర్గ భవాని, ఎస్.చంద్ర, పి.గంగావర్షిణి, ఐ.దేవి, కె.ఆదస్య విజేతలుగా నిలిచారు. వారికి ప్రతిభ విద్యాలయం కరస్పాండెంట్ దాసం శేషావు,ఏవో నాగేశ్వరరావు, హెచ్‌ఎం సుజాతలు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయలు ఆశారాణి, సుజాత, అనంతలక్ష్మి,దుర్గాదేవి, రాజేశ్వరి, వీరాస్వామి పాల్గొన్నారు.

'ఆదిత్య'లో చదరంగం పోటీలు ప్రారంభం

గండేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం 2025కి సంబంధించి ఇంట్రామ్యూరల్ చెస్ టోర్నమెంట్‌ని యూనివర్శిటీ డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులను డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి అభినందించారు. ప్రతీ ఒక్కరూ ఆటల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపాలన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థులకు ముఖ్యమేనన్నారు.

అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా విష్ణు

అన్నవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అన్న వరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా గంటా విష్ణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న బీఎస్ఎన్ రాజు స్వచ్ఛందంగా వైదొలగడంతో ఉద్యోగులంతా విష్ణును ఎన్నుకున్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం కృషిచేస్తానని విష్ణు తెలిపారు. ఆయనను సహచర ఉద్యోగులు అభినందించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఆటిజంపై విద్యార్థులకు అవగాహన



కోటనందూరులో ఆటిజంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోటనందూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు ఆటిజం అనుమానిత లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్లు సంప్రదించాలని ఫిజియోథెరిపిస్టు డాక్టర్ సోమేశ్వరరావు అన్నారు. బుధవారం కోటనందూరులో నాన్ భవిత కేంద్రం వద్ద ప్రపంచ ఆటిజంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆటిజం ఉన్న పిల్లలకు మందులు వాడటం, కౌన్సిలింగ్ ద్వారా మానసిక పరిపక్వతను పెంచవచ్చన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం జయమ్మ, కె.వి.సత్యనారాయణ, నగగోవింద్, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి


తహశీల్దార్ తాతారావుతో చర్చిస్తున్న ఫిర్యాదుదారులు

శంఖవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కత్తిపూడి నుంచి శంఖవరం వరకు నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ల వల్ల వందేళ్ల నాటి వృక్షాలను నరికేస్తున్నారని జనసేన నేత మేకల కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. వాల్టా చట్టానికి చైర్మన్ అయిన తహశీల్దార్ అనుమతి లేకుండా ఎలా నరికి వేస్తారని ఆయన ప్రశ్నించారు. దీన్ని నిలిపివేయాలని తహశీల్దార్ తాతారావును కోరారు. ఆర్ అండ్‌బీ జేఈ, విద్యుత్ ఏఈ భగత్‌కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

'శ్రామిక కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం'


యనమల రామకృష్ణుడును కలిసిన శ్రామిక సంఘ ప్రతినిధులు, సభ్యులు

తుని రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): శ్రామిక కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. తుని, పాయకరావుపేటకు చెందిన శ్రామిక సంఘ ప్రతినిధులు, పలువురు సభ్యులు తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో యనమలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ కార్మిక సంఘాలను, కార్మికులను వైసీపీ ప్రభుత్వ గాలికి వదిలేసిందని, లేబర్ ఇన్సూరెన్స్ పాలసీని అమలు చేయకపోగా కార్మిక సంఘాల నగదు దారి మళ్లించిందన్నారు. కార్యక్రమంలో శ్రామిక సంఘ ప్రతినిధి సీహెచ్ ఆంజనేయులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దేశ సంప్రదాయాలను కాపాడుకోవాలి


సిరిపురం ఆశ్రమంలో యజ్ఞం చేస్తున్న దృశ్యం

ఏలేశ్వరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దేశ సంస్కృతి సంప్రదాయాలు రక్షించుకున్నప్పుడే సమసమాజ నిర్మాణం సాధ్యపడుతుందని విశ్వనాథ భారతి స్వామి అన్నారు. సిరిపురం శ్రీచిద్గగనానంద గీతాశ్రమంలో నిర్వహించిన 51వ రాష్ట్రస్థాయి భక్తి, జ్ఞాన, వేదాంత మహోసభలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమానికి వివిధ ఆశ్రమాలకు చెందిన స్వామీజీలు పాల్గొని గీతాయజ్ఞం, సూర్యనమస్కారాలు, గీతా పారాయణ, ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. అనపర్తి దుర్గాప్రసాద్, ఆకుల సూకాపతి, రమణ దంపతులతో దివ్యానంద సరస్వతి యజ్ఞం చేయించారు. యల్లపు సూర్యనారాయణ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తన గుర్తించాలి


ఆటల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలేశ్వరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆటిజం డే సందర్భంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో ఆటిజం డే పురస్కరించుకుని భవిత కేంద్రం ఉపాధ్యాయులు వాణిపద్మజ, బుజ్జి మాట్లాడుతూ పిల్లల ప్రవర్తన, వారి విధివిధానాలు ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనించాలన్నారు. చెవిటి, మూగ, అంగవైకల్యంతో ఉన్న పిల్లలు మానసికంగా ఒత్తిడికి గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు.

ఉపాధి హామీ పథకంలో జిల్లాలో గండేపల్లికి రెండో స్థానం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నాతి బుజ్జి

గండేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో 2024-25 సంవత్సరానికి గండేపల్లి మండలం జిల్లాలోనే రెండోస్థానంలో ఉందని ఎంపీడీవో నాతి బుజ్జి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలో కూలీలకు 4.93కోట్ల పనిదినాలు కల్పించామన్నారు. 62.16శాతం పనిదినాలు కల్పించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచామన్నారు. మండలంలో 986 కుటుంబాలకు వంద రోజుల పని దినాలు కల్పించామన్నారు. వికలాంగ వేతనదారులకు 12879 పని దినాలు కల్పించామన్నారు. వేతనాల రూపంలో రూ.11. 64కోట్లు ఖర్చు చేశామన్నారు. కార్యక్రమంలో ఏపీవో రామకృష్ణరాజు, ఈసీ రమేష్ తదితరులున్నారు.

గండేపల్లి ఏపీవోగా రామకృష్ణరాజు బాధ్యతల స్వీకరణ


ఎంపీడీవోను కలిసిన నూతన ఏపీవో రామకృష్ణరాజు

గండేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి ఏపీవోగా ఎం.రామకృష్ణరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఎంపీడీవో నాతి బుజ్జిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఉపాధి హామీ పథకంలో మండలం రెండో స్థానంలో ఉందని, మొదటి స్థానంలో నిలపాలని ఏపీవోకు ఎంపీడీవో తెలిపారు. కృష్ణరాజుకు ఈసీ రమేష్, టీఏలు శ్రీను, మోహన్, శ్రీను, అబ్బులు, శేఖర్ పలువురు స్వాగతం పలికారు.

వరి పొలాలు పరిశీలించిన శాస్త్రవేత్తలు


కాత్రావులపలిలలో వరి పొలాలను పరిశీలిస్తున్న సీతారామశర్మ, సుజాత, శాస్త్రవేత్తలు

జగ్గంపేట రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాత్రావులపల్లిలో ఏరువాక కేంద్రం, పెద్దాపురం శాస్త్రవేత్త సీతారామశర్మ, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సుజాత పర్యటించారు. వరి పొలాలను పరిశీలించారు. ఒరిస్సా బొండాలు, బొండాలు ఎంటీయూ 3626 రకాలు పండిస్తున్న పొలాల్లో కాండం కుళ్లు తెగుళ్లను గుర్తించారు. ఈకాండం కుళ్లు తెగుళ్ల నివారణకు పొలంలోని నీళ్లను మొత్తం తీసివేసిన తరువాత వాలిడామైసిన్ లేదా టె బుకొనజోల్ మందులను లీటరు నీటికి రెండు మిల్లీలు చొప్పున కలుపుకుని పిచికారి చేయాలని రైతులకు సూచించారు. అనంతరం పొలంలోకి కొత్త నీటిని పెట్టుకోవాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్, రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై వాహనదారులకు కౌన్సిలింగ్

కిర్లంపూడి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) కృష్ణవరం టోల్‌గేట్ వద్ద జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్ఐలు రఘునాథరావు, సతీష్, పోలీసు సిబ్బంది హెల్మెట్ ధారణపై వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనం నడిపేవారు, వెనుక కూర్చునేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతామని పోలీసులకు హామీ ఇచ్చారు.